# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 191

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/-   పేజీలు 8   తేది: ఆదివారం 09 ఆగస్టు 2026








ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ ఘటనలకు నిరసనగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు జార్ఖండ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ఓసారి వారితో చర్చలు జరపగా.. తాజాగా శనివారం రెండో దఫా చర్చలు నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు.

**సమయం ప్రతినిధి:** పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలు సహా పలు అంశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. చర్చల అనంతరం మాట్లాడిన విద్యార్థులు.. ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అయితే, తమ డిమాండ్లపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురుచూస్తున్నట్లు నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు పేర్కొన్నారు. కాగా, జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్ ఘటనలకు నిరసనగా విద్యార్థులు 15 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరసన దీక్షలు, ధర్నాలు కొనసాగుతున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (JPSC), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (JSSC-CGL) నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఈ సందర్భంగా వారు ఆరోపిస్తున్నారు. 14వ జేపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష పేపర్లతో పాటు అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు లీక్ కావడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నమోదైన పేపర్ లీక్ కేసులపై సీఐడీ విచారణ సక్రమంగా జరగడం లేదని, నామమాత్రంగానే దర్యాప్తు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అలాగే, గత ఏడేళ్లుగా జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ ద్వారా నిర్వహించిన అన్ని నియామక పరీక్షలపై సీబీఐ లేదా ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కోరుతున్నారు.




ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇటీవల రహదారులు కుంగిపోవడం, పగుళ్లు ఏర్పడటం వంటి సమస్యలు ప్రయాణికులను తీవ్రంగా వేధిస్తున్నాయి. మొన్న రూ.4,200 కోట్లతో నిర్మించిన లక్నో-కాన్పూర్ ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన కొన్ని రోజులకే పగుళ్లు ఏర్పడగా.. తాజాగా ఆగ్రాలోని కమలా నగర్ ప్రాంతంలో రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయింది.

**న్యూఢిల్లీ, సమయం ప్రతినిధి:** రోడ్డు కుంగిపోయి ఏకంగా పెద్ద గుంతే ఏర్పడింది. ప్రమాద సమయంలో ఆ రహదారిపై వాహనాలు వెళ్లకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలికి చేరుకుని అటువైపుగా వాహనాలు వెళ్లకుండా నియంత్రించారు. అయితే, రోడ్డుపై భారీ గొయ్యి ఏర్పడిన కమలా నగర్ ప్రాంతానికి సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు నితిన్ కోహ్లీ చేరుకున్నారు. తన అనుచరులతో కలిసి అక్కడికి వచ్చిన ఆయన.. నిచ్చెన సహాయంతో గుంతలోకి దిగారు. అక్కడే నిలబడి ప్రభుత్వం, అధికారులపై విమర్శలు గుప్పించారు. వర్షాకాలంలో పదేపదే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కోహ్లీ మండిపడ్డారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనుల్లో తీవ్ర అవినీతి జరుగుతోందని, అందుకే ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని కోహ్లీ ఆరోపించారు. ఆగ్రా నగరాన్ని గుంతల నగరంగా మార్చేస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రహదారిపై ఏర్పడిన గుంతను పాతాళానికి దారిగా అభివర్ణించారు. ఇలాంటి ప్రమాదాలు ప్రజల భద్రతకు ముప్పు కలిగిస్తాయని, అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నితిన్ కోహ్లీ డిమాండ్ చేశారు.




**(సమయం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్డ్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. జిల్లాల వారిగా స్మార్డ్ కార్డు పంపిణీ అంశంపై శుక్రవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాలో కార్డులు, లబ్దిదారుల సంఖ్య, బియ్యం కోటా సరఫరా తదితర అంశాలను జిల్లా అధికారులు మంత్రికి వివరించారు.

**15 నుంచి లబ్ధిదారుల చేతికి :** స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశా లపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం రేషన్‌కార్డుల సంఖ్య 2,57,815. ఈ మేరకు స్మార్ట్ కార్డులు పంపిణీ కానున్నాయి. మూడు నెలల కిందట రేషన్ కార్డులు సంఖ్య 2,28,651. కొత్తగా 29,164 కార్డులు మంజూరు అయ్యాయి. దీంతో కార్డుల సంఖ్య 2,57,815కు చేరింది. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగు తూనే ఉంటుంది.

**4874.027 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా...**

జిల్లాలో మొత్తంగా రేషన్ షాపుల సంఖ్య 414. మొత్తం రేషన్‌కార్డులు 2,57,815. లబ్ధిదారుల సంఖ్య 7,75,274. ఈ మేరకు హనుమకొండ జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కోటా 4874.027. మూడు నెలల కిందట ఉన్న కార్డుల సంఖ్య 2,28,651 మేరకు బియ్యం కోటా 4257.292 మెట్రిక్ టన్నుల బియ్యం. కొత్తగా 29,164 కార్డులు పెరగడంతో 616.735 మెట్రిక్ టన్నుల పంపిణీ కోటా పెరగింది.



## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు: ఉత్తమ్

**హైదరాబాద్ :** సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, R&R కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. ఈరోజు (శనివారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు.

**రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి..**

2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.




**హైదరాబాద్, (సమయం ప్రతినిధి):** రాజస్థాన్ – హైదరాబాద్ డ్రగ్స్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టయింది. తెలంగాణ ఈగల్ ఫోర్స్ చేపట్టిన భారీ ఆపరేషన్‌లో రెండు వేర్వేరు కేసుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితుల దగ్గరి నుంచి 1.031 కిలోల నల్లమందును (ఓపీయం) స్వాధీనం చేసుకున్నారు. మరో 25 గ్రాముల మెఫెడ్రోన్ సీజ్ చేశారు. మియాపూర్, సైదాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేశారు. రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు ఈ ముఠా డ్రగ్స్ సరఫరా చేస్తోంది. సప్లయర్లు, మధ్యవర్తులు, కొరియర్లు, డెలివరీ ఏజెంట్లతో ఈ నెట్‌వర్క్ నడిపిస్తున్నట్లు ఈగల్ అధికారులు గుర్తించారు. ప్రైవేట్ బస్సులు, రైళ్లు, కార్ల ద్వారా ఈ డ్రగ్స్ తరలించారు. డ్రగ్స్ లావాదేవీలకు డిజిటల్ కమ్యూనికేషన్, యూపీఐ ట్రాన్సాక్షన్లు కొనసాగిస్తున్నట్లు ఈగల్ అధికారుల దర్యాప్తులో తేలింది. 2023 నుంచి రాజస్థాన్ లింక్ ఉన్న 78 డ్రగ్స్ ట్రాఫికింగ్ ప్రయత్నాలను తెలంగాణ పోలీసులు అడ్డుకున్నారు. యువతను కొరియర్లు, డెలివరీ ఏజెంట్లుగా ఈ డ్రగ్స్ ముఠాలు వాడుతున్నాయని విచారణలో తేలింది. రాజస్థాన్ లింక్ నెట్‌వర్క్‌లలో తరచుగా, ఓపీయం, డోడా చూరాను గుర్తించారు. మియాపూర్ కేసులో రాజస్థాన్‌కు చెందిన మహేందర్ కుమావత్ డ్రగ్స్ పంపించారు. బెంగళూరు మీదుగా హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలించినట్లు దర్యాప్తులో వెల్లడించారు. డ్రగ్స్ తరలింపులో ట్రావెల్స్ డ్రైవర్‌ను కూడా ఉపయోగించారు. నిందితుల దగ్గరి నుంచి మొబైల్స్, నగదు, వాహనాలు, ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి తెలంగాణకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న విస్తృత నెట్‌వర్క్‌పై ఈగల్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

## హైడ్రాలో ఉద్యోగాల కోసం వస్తే అవమానిస్తారా.. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాల్సిందే: హరీశ్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 8:** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను అవమానించడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు.



**హరీశ్ రావు పోస్ట్..**

'విద్యార్థులు, నిరుద్యోగులు అంటే మీ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కక్ష రేవంత్ రెడ్డి? అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా? ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు?అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. 32 నెలలు దాటింది, ఆ హామీ ఏమైంది?' అని ప్రశ్నించారు. 'రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. జాబ్స్ ఇవ్వడం లేదు. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి ఏకంగా విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి.. నిరుద్యోగులు మీపై జాలి అడగడం లేదు. మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతున్నారు. ఉద్యోగం అడగడం నేరం కాదు. ప్రశ్నించడం నేరం కాదు. ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదు. ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలి. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు.

# సంపాదకీయం

## గాంధీ గర్వించే ‘దేశద్రోహులు’!

ఏ దేశ పౌరులలోనైనా మహోన్నతులు ఎవరు? ప్రజాహితాన్ని పట్టించుకోని పాలకులను ప్రశ్నించేవారు, అధికారానికి ఎట్టి పరిస్థితులలోను మోకరిల్లనివారు, దేశ స్వాతంత్ర్యాన్ని, జాతి గౌరవాన్ని కాపాడేందుకు, అవసరమైతే ప్రభుత్వాన్ని సైతం ఎదిరించేందుకు వెనుకాడనివారే నిక్కమైన దేశభక్తులు, గొప్ప పౌరులు’ -- ఇవి, ఫ్రెంచ్ రచయిత ఆల్బర్ట్ కామూ ఉద్ఘాటించిన సత్యాలు. ఇరవయో శతాబ్ది బ్రిటిష్ చరిత్రకారులలో అగ్రగణ్యుడైన ఏజేపీ టేలర్ ఆధునిక జర్మనీ, ఆధునిక బ్రిటన్, ప్రథమ, ద్వితీయ ప్రపంచ యుద్ధాలు, లార్డ్ బీవర్ బ్రూక్ మీడియా సామ్రాజ్యంపై పలు పుస్తకాలు రాశారు. అయితే అన్నిటిలోకి తనకు బాగా ఇష్టమైన పుస్తకం అని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. గ్రేట్ బ్రిటన్ విస్తరణవాద, సామ్రాజ్యవాద విదేశాంగ విధానాలను వ్యతిరేకించిన బ్రిటిష్ రాజనీతిజ్ఞుల గురించిన అధ్యయనాలే ఆ విశిష్ట గ్రంథం. 19వ శతాబ్ది ఉదారవాద రాజకీయవేత్త జాన్ బ్రైట్ ఆ రాజనీతిజ్ఞులలో ఒకరు. బ్రైట్ మహాశయుడు ఒక సార్వకాలిక మహావక్త. కామన్స్ సభలో పార్లమెంటరీ సంస్కరణలు, విదేశాలలో బ్రిటిష్ సైనిక జోక్యాలకు వ్యతిరేకంగా ఆయన ప్రసంగాలు ప్రజలను ప్రభావితం చేశాయి, పాలకులకు దడ పుట్టించాయి. ప్రభుత్వ విధానాలపై ఆయన విమర్శలు టోరీలను కోపావేశులను చేశాయి. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా బ్రైట్ వదరుతున్నాడని వారు ఆరోపించారు. ఆ అభియోగంపై ఆ ఉదారవాద రాజనీతిజ్ఞుడు తీక్షణంగా ప్రతిస్పందించాడు: ‘నేను మీ కంటే ఎక్కువగా ఆంగ్లేతరుడిని, దేశ వ్యతిరేకిని ఎలా కాగలను? నేను ఈ గడ్డపై పుట్టలేదా? నేను కూడా మీరు వచ్చిన ఇంగ్లీష్ వంశం నుంచే రాలేదా? నా కుటుంబం ఈ దేశ భద్రత, శ్రేయస్సుకు కట్టుబడలేదా? నాకు ఉన్న సిరి సంపదలు ఏవైనా మీ ఆస్తిపాస్తుల మాదిరిగానే మన మాతృభూమి సుపరిపాలనపైనే ఆధారపడి ఉన్నాయి కదా. మరి ఈ దేశ వ్యవహారాలకు సంబంధించిన ఒక అంశంపై తోటి దేశస్థుడు ఒకరు భిన్నాభిప్రాయాన్ని కలిగి ఉన్నాడనే కారణంతో అతడిని దేశ ద్రోహి, జాతి వ్యతిరేకి అని మీరు ఎలా అంటారు?’ నేను ఈ మాటలను మూడు దశాబ్దాల క్రితం మొట్టమొదటిసారి చదివినప్పుడు నా మనసులో నాటుకుపోయాయి. ముఖ్యంగా ‘దేశ ద్రోహి’ లేదా ‘దేశ వ్యతిరేకి’ (యాంటీ-నేషనల్) అనే నిందాపూర్వకమైన తిట్టు నా యవ్వనకాల భారతదేశంలో సర్వత్రా వినిపిస్తుండేది. సాక్షాత్తూ మన ప్రధానమంత్రే స్వయంగా ఆ దూషణ పదాన్ని ఉపయోగించారు. 1971లో భారీ మెజారిటీతో అధికారాన్ని గెలుచుకున్న ఇందిరాగాంధీ క్రమంగా నిరంకుశ పాలకురాలిగా పరిణమించారు. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను సహించలేకపోయారు. రాజ్యాంగ వ్యవస్థలు, సంస్థలు అన్నిటినీ తన అధికారానికి దాసోహం చేసుకున్నారు. భారత జాతీయ కాంగ్రెస్‌ను తన కుటుంబ సంస్థానంగా మార్చివేశారు. ఇందిర పాలనా విధానాలను స్వాతంత్ర్య సమరయోధుడు, నిష్కళంక ప్రజానాయకుడు జయప్రకాశ్ నారాయణ్ ప్రశ్నించారు. ఆయనతో సహా ప్రతిపక్ష నాయకులు చాలామందికి విదేశీ నిధులు అందుతున్నాయని ఇందిర ఆరోపించారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తన విమర్శకులను దేశ వ్యతిరేకులు అని నిందించారు. మోదీ సర్కార్ విధానాలను వ్యతిరేకించే వారికి ప్రత్యర్థి దేశమైన పాకిస్థాన్ నుంచి ఆర్థిక లబ్ధి సమకూరుతుందని లేదా అమెరికా వ్యాపార దిగ్గజం జార్జి సోరోస్ తరఫున వ్యవహరిస్తున్నారని ప్రధానమంత్రి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. మోదీ ప్రభుత్వ నిరంకుశ పాలనను, మెజారిటేరియన్ విధానాలను వ్యతిరేకించేవారిని ‘తుక్డే తుక్డే గ్యాంగ్’గా అభివర్ణిస్తున్నారు. ఈ సువిశాల భారతదేశాన్ని మరోసారి ముక్కలు చెక్కలు చేసేందుకు విదేశీ ప్రభుత్వాల తరఫున వ్యవహరిస్తున్నారని కూడా విమర్శిస్తున్నారు. ‘అర్బన్ నక్సల్స్’, ‘మెకాలే పుత్రులు’ సహా మరెన్నో నిందాపూర్వక మాటలతో దూషిస్తున్నారు. ఈ దూషణలు, ఆరోపణలు అన్నీ నిరాధారమైన అనుమానాలే. ఒక స్పష్టమైన మానసిక రుగ్మతకు అవి తార్కాణాలు. ప్రశ్న పత్రాల లీక్‌లతో సహా ప్రభుత్వ విద్యావ్యవస్థలోని అవినీతికి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అశేష విద్యార్థుల నిరసనలపై సంఘ్ పరివార్ విమర్శలు ఆ అనుమానాస్పద ఆలోచనా విధానానికి తాజా నిదర్శనాలు. భారతీయులను రెండు వర్గాలుగా విభజించడం సంఘ్ పరివార్‌కు చెందిన అతి జాతీయవాదులకు పరిపాటి. మొదటి వర్గం దేశభక్తులు. వీరు జాతిశ్రేయస్సుకు అంకితమయినవారు. రెండో వర్గం దేశద్రోహులు. వీరు విశ్వాసఘాతకులు. మాతృభూమి ఉన్నతికి వ్యతిరేకులు. మోదీ ప్రభుత్వ మద్దతుదారులు మొదటివర్గం కిందకు వస్తారు. ప్రభుత్వ విధానాలతో విభేదించేవారు రెండో వర్గం కిందకు వస్తారు. అప్పుడప్పుడూ భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసేవారు సైతం దేశద్రోహుల కిందే లెక్క. విద్యార్థుల నిరసనల సందర్భంలో ‘దేశద్రోహి’ అనే నిందాపూర్వక మాటలోని ద్వేషపూరిత కపటత్వం సుస్పష్టంగా కనిపిస్తున్నది. నేహా దీక్షిత్ ఇటీవల ‘హిమల్’లో రాసిన ఒక వ్యాసంలో, ఆ నిరసనల్లో పాల్గొన్న ఉత్తరప్రదేశ్ విద్యార్థిని ఒకరు చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు: ‘నాకు ఊహ వచ్చినప్పటి నుంచీ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారంతా ‘దేశద్రోహులే’ అన్న తిరస్కారపూరిత మాట వింటున్నాను. అయితే జాతీయ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీక్‌లు, వాటికి కారణమైన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చేందుకు దేశాన్ని పరిపాలిస్తున్న పార్టీ చేసిన ప్రయత్నాలు అవగతమైన తరువాత నేను ఒక సత్యాన్ని గ్రహించాను-- లీక్‌లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు దేశద్రోహులు కారని, భారత ప్రభుత్వమే దేశద్రోహానికి పాల్పడుతోందని’. నిండు సత్యం ఉన్న నిశిత వ్యాఖ్య ఇది, సందేహం లేదు. ప్రభుత్వాన్ని అధిక్షేపించేందుకు వ్యంగ్యాన్ని ఉపయోగించుకోవడం ప్రస్తుత విద్యార్థి నిరసనల విలక్షణ విశేషం. ఈ యువ నిరసనకారులకు తెలియకపోవచ్చుగానీ దేశ పాలకులను నిలదీసేందుకు తాము ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యంగ్యాత్మక అవహేళనలకు గౌరవార్హమైన పూర్వ దృష్టాంతాలు ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులు విదేశీ ప్రభుత్వాల నుంచి ఆర్థిక లబ్ధి పొందుతున్నారని ఇందిరాగాంధీ ఆరోపించినప్పుడు స్వతంత్ర పార్టీ ఎంపీ పిలూ మోడీ ఒకరోజు ‘నేను సీఐఏ ఏజెంట్‌ను’ అని రాసి ఉన్న ప్లకార్డును మెడకు కట్టుకుని లోక్‌సభకు వచ్చారు. దశాబ్దాల అనంతరం మోదీ సర్కార్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలు ప్రజ్వరిల్లినప్పుడు బెంగళూరులో ఒక బహిరంగ సభకు స్వాతంత్ర్యానంతర భారతీయ సాహిత్య దిగ్గజాలలో ఒకరైన గిరీశ్ కర్నాడ్ ‘నేనూ అర్బన్ నక్సల్‌నే’ అని రాసి ఉన్న ఒక ప్లకార్డును మెడకు కట్టుకుని వచ్చారు. అధికారాన్ని వెటకారం చేయడంలో ఈ విలక్షణ సంప్రదాయాన్ని విద్యార్థి నిరసనకారులు మరింత ప్రభావవంతంగా ముందుకు తీసుకెళ్లారు. నిజమైన జాతీయవాది ఎవరు? ఆగ్నేయాసియా దేశాలలో జాతీయోద్యమాలను సమగ్రంగా అధ్యయనం చేసిన ఆంగ్లో--ఐరిష్ రాజకీయ శాస్త్రవేత్త బెనెడిక్ట్ ఆండర్సన్ ఒకసారి ఇలా రాశారు: ‘ఇంట సొంత పౌరులపైన, బయట విశాల ప్రజానీకానికి వ్యతిరేకంగా తమ సొంత దేశం లేదా ప్రభుత్వం పాల్పడుతున్న నేరాలకు సిగ్గుపడనివారు, పడలేనివారు ఒక నిజమైన జాతీయవాది కాదు, కాలేదు కూడా. ఆండర్సన్ భావనతో గాంధీ, అంబేడ్కర్ అంగీకరించి ఉండేవారు. భారతీయ సమాజంలో సర్వత్రా ఉన్న అసమానతలు, జాతి పురోభివృద్ధికి ఆటంకమవుతున్నాయని, బ్రిటిష్ వలసపాలన నుంచి విముక్తమయ్యే లోగానే సామాజిక అంతరాలు, ఆర్థిక అసమానతలను అంతమొందించే కృషి ఆరంభమవ్వాల్సిన అవసరం ఉందని గాంధీ, అంబేడ్కర్ ఇరువురూ భిన్నరీతుల్లోనే అయినప్పటికీ, పూర్తిగా గుర్తించారు. మరీ ముఖ్యంగా నిమ్న కులాల వారు ఎదుర్కొంటున్న అణచివేతలు, మహిళలకు మానవ హుందాను నిరాకరిస్తోన్న సామాజిక దురాచారాలు, దౌష్ట్యాలు శిఖరసమానులైన ఆ మానవీయులను అమితంగా వ్యాకులపరిచాయి. వివక్షలు, అన్యాయాల నుంచి వారిని విముక్తం చేసేందుకు ఆ ఇరువురూ దృఢ సంకల్పంతో కృషి చేశారు. పరాయి పాలనను వదిలించుకుని, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా వ్యవస్థీకృతమైన భారత్, కుల అస్తిత్వాలను, జెండర్ అసమానతలను నిషేధించిన రాజ్యాంగాన్ని శిరసావహిస్తోంది. అయినప్పటికీ నిత్య జీవితంలోను, రాజ్య వ్యవహారాలలోను, విశాల సమాజ జీవితంలోను వివక్షలు, అన్యాయాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ శోచనీయ స్థితికి ఒక జాతీయవాది విధిగా లజ్జాభరితుడు కావాలి; ప్రభుత్వ భద్రతా దళాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండించాలి; అడుగడుగునా ఎదురవుతున్న అవినీతిపై ఆగ్రహించాలి; ప్రభుత్వాధికారుల, రాజకీయవేత్తల అసమర్థతను గర్హించాలి.

## అఖండ భజన సప్తహా కార్యక్రమంను ప్రారంభించిన ఎమ్మెల్యే

(సమయం ప్రతినిధి జోగులాంబ గద్వాల) : గద్వాల నియోజకవర్గంలోని మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ ఆదిశీలా క్షేత్రము మల్దకల్ లొ వెలిసిన శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి సన్నిధి యందు అఖండ జ్యోతి సప్తహ భజన ఏడు రోజుల కార్యక్రమంను లిగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొని భజనను ప్రారంభించినారు. ఆలయ చైర్మన్ ప్రహలాధ రావు ఎమ్మెల్యేని శాలువా పూలదండతో సాంప్రదాయబద్ధంగా సన్మానించారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కను నాటి, అన్న ప్రసాదాల పంపిణి కార్యక్రమంలొ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... మల్దకల్ గ్రామంలోని శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలొ అఖండ జ్యోతి సప్తహ భజన ఏడు రోజుల భజన కార్యక్రమంను ప్రారంభించుకున్నందుకు చాల ఆనందంగా ఉందని ఈ భజన వలన సకాలంలో వర్షములు వచ్చుటకు, అతివృష్టి, అనావృష్టి జరగకుండా పాడిపంటలు బాగా పండి సస్యశామలముగా ఉండుట కొరకు, ప్రజలందరికి ఆయు ఆరోగ్య సంపదలు కలుగుటకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేయనైనది. ఇట్టి కార్యక్రమం నందు అందరు భక్తులు అపార భక్తి శ్రద్దలతో పాల్గొని శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

## నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలి: అదనపు కలెక్టర్



బాలానగర్, (సమయం ప్రతినిధి): బాలానగర్‌లో జరుగుతున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని నిర్ణీత నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని NHAI అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన పనులను కూడా పరిశీలించారు. నిర్మాణ పనుల్లో సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని, ఆమోదించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్మికులు, వాహనదారులు, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా సరైన నిర్వహణ చర్యలు చేపట్టి, నాణ్యత, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

## విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి: ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

## ప్రాథమిక దశలోనే భాష, గణిత నైపుణ్యాలకు పటిష్ట పునాది వేయాలి

మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి): ఉపాధ్యాయ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు. స్థానిక మోడల్ బేసిక్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంతో పాటు మెరుగైన విద్యా ఫలితాలు సాధించేలా పనిచేయాలని అన్నారు. ప్రాథమిక దశలోనే విద్యార్థుల అభ్యసన పునాదులు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను తరగతి గదుల్లో ఉపయోగిస్తూ ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి తగిన బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రాథమిక భాషా, గణిత నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థుల భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయాలని కోరారు. కార్యక్రమంలో జీఈసీఓ అస్రా ఖాద్రి, కోర్సు డైరెక్టర్ ఎంఏ బాసిత్, డీఆర్‌పీలు రవి చంచల, రవీందర్, మాధవి, రాఘవేందర్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## మక్తల్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

నారాయణపేట : మక్తల్ నియోజకవర్గంలో డాక్టర్ మణికంఠ గౌడ్ కావలి ప్రవీణ్ ఆధ్వర్యం లో పండుగ సాయన్న వేడుకలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా డాక్టర్ మణికంఠ గౌడ్ పండుగ సాయన్న చరిత్ర గురించి మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా వీరుడు. 1850 నుంచి 1900 మధ్య కాలానికి చెందిన ఈయన, మహబూబ్‌నగర్‌కు సమీపంలోని నవాబ్‌పేట మండలం, మెరుగోనిపల్లె గ్రామంలో తల్లి సాయమ్మ, తండ్రి అనంతయ్యలకు జన్మించాడు. వెట్టిచాకిరి, అక్రమ పన్నులతో ప్రజలను పీడించే నిజాం భూస్వామ్య వ్యవస్థను ఎదిరించి, పేదలకు అండగా నిలిచి, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా, ప్రజా వీరుడిగా చరిత్రలో నిలిచిపోయాడు. కేవలం 35-38 ఏళ్ల వయసులోనే కుట్రపూరితంగా చంపబడ్డ ఈయన జీవితంలోని ఈ కోణాన్ని పరిశీలిద్దాం. పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలు ఆనాటి సమాజంలో పెద్ద ఆర్థిక భారంగా ఉండేవి. కట్నకానుకలు, వివాహ ఖర్చులు భరించలేక అనేక మంది తల్లిదండ్రులు తమ కుమార్తెల వివాహాలను వాయిదా వేసుకునేవారు,ఈ సమస్యను గుర్తించిన పండుగ సాయన్న, పేద ఆడబిడ్డలకు సామూహిక వివాహాలు జరిపించే బాధ్యతను తానే స్వీకరించాడు. బంగారు పుస్తెల తాళ్ళు, కొత్త బట్టలు, భోజన ఏర్పాట్లు అన్నీ తానే స్వయంగా సమకూర్చేవాడు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, సామాజిక సంస్కరణ కూడా. ఈ సామూహిక వివాహాల్లో కులాంతర వివాహాలను ప్రత్యేకంగా ప్రోత్సహించడం ద్వారా, కులాల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు. ఈ కార్యక్రమాల వెనుక సాయన్న వ్యక్తిగత జీవితం కూడా ఒక ముఖ్యమైన కోణాన్ని జోడిస్తుంది. చరిత్రకారుల విశ్లేషణ ప్రకారం, ఈ సామూహిక వివాహాలు కేవలం దానధర్మ కార్యక్రమాలు మాత్రమే కాక, సాయన్న సామాజిక సంస్కరణ దృక్పథానికి నిదర్శనం. కులాంతర వివాహాలను ప్రోత్సహించడం ద్వారా, ఆనాటి కఠినమైన కుల నిబంధనలను సవాలు చేసే ధైర్యం చేశాడు. ఇది ఆధిపత్య వర్గాలకు ససేమిరా నచ్చని విషయం, ఎందుకంటే కుల స్వచ్ఛత అనే భావనను కాపాడుకోవడం వారి అధికార నిర్మాణంలో కీలక భాగం. సాయన్న ఈ సంప్రదాయ నిబంధనలను ధిక్కరించి, ప్రేమ, సమానత్వం ఆధారంగా కొత్త సామాజిక సంబంధాలను నిర్మించే ప్రయత్నం చేశాడు. పండుగ సాయన్న సామాజిక సంస్కరణ కృషిని బహుజన ఉద్యమ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా పేర్కొంటారు. ఈ కార్యక్రమం లో మక్తల్ నియోజకవర్గ నాయకులు రామన్ గౌడ్ గౌడి బాల్ రెడ్డి ఉమేష్ కృష్ణ గౌడ్ వీరేష్ మామిళ్ళ అనిల్ లక్ష్మినారాయణ వీరమహిళలు డాక్టర్ సబిత లలిత భాగ్య సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీలు మాత్రమే కాదు.. దేశ స్వప్నాన్నీ సాకారం చేయాలి: మోదీ

మొదటి పేజీ తరువాయి

దేశ రాజధానిలో ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. సుమారు 3 వేల మందికి పైగా గ్రాడ్యుయేట్లు ఈ స్నాతకోత్సవంలో డిగ్రీలు అందుకోగా.. వారిలో 587 మంది పీహెచ్‌డీ అభ్యర్థులు ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్, శంకర్ దయాళ్ శర్మ గోల్డ్ మెడల్ సహా పర్ఫెక్ట్ టెన్ గోల్డ్ మెడల్స్‌ను కూడా ప్రదానం చేశారు మోదీ. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తూ.. ‘ఐఐటీ విద్యార్థులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఇవాళ్టి నుంచి మీ కొత్త ప్రయాణం ప్రారంభమైంది’ అని అన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలు తీసుకోవడం లేదని.. దేశ స్వప్నాలను సాకారం చేసే బాధ్యతను స్వీకరిస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థి మనసులో ఎన్నో ఆలోచనలు, కలలు, లక్ష్యాలు ఉంటాయన్న ప్రధాని.. లక్ష్యాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, తాము అనుకున్న గమ్యాన్ని చేరేందుకు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఐఐటీల్లో పొందిన విద్య, నైపుణ్యాలను దేశ అభివృద్ధికి ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ‘పరమ్ ప్రజ్ఞ’ ఏఐ ఆధారిత హైపెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ సదుపాయాన్ని వర్చువల్ ప్రారంభించారు.

## భారత్, ఫ్రాన్స్ రఫేల్ డీల్

న్యూఢిల్లీ : భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతేనే పూర్తి ప్రయోజనాలు వస్తాయి.





# మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో విద్యా వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ

**మహబూబ్ నగర్ :** నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలి విశేషంగా కృషి చేస్తున్నారు. విద్యను సామాజిక మార్పుకు మూలస్తంభంగా భావించిన ఆయన, తన సొంత నిధులతో విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం 35 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన విద్యా వాలంటీర్ల వ్యవస్థ విశేష ఫలితాలను అందించింది. విద్యార్థుల హాజరు పెరగడం, అభ్యాస నైపుణ్యాలు మెరుగుపడడం, బలహీన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెరగడం వంటి సానుకూల మార్పులు కనిపించాయి. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని విస్తరించి నియోజకవర్గంలోని వంద ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, విద్యావంతులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించి, పారదర్శకంగా ప్రత్యేక ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి, 100 మంది విద్యా వాలంటీర్లను ఎంపిక చేసి, వారికి సమగ్ర శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఆగస్టు 8, 9, 10 తేదీలలో మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతోంది. నిష్ణాతులైన అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో బోధన పద్ధతులు, విద్యార్థుల మానసిక స్థితి అవగాహన, సబ్జెక్ట్‌పై పట్టు పెంపు, డిజిటల్ లెర్నింగ్ విధానాలు వంటి అంశాలపై విస్తృతంగా శిక్షణ అందిస్తున్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోంది. వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో మొదటి రోజు శిక్షణ తరగతులు సజావుగా జరిగాయి. వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభ్యసిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడటమే కాకుండా, పేద మరియు గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు పెరుగుతాయని స్థానికులు మరియు విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మహబూబ్ నగర్ ఫస్ట్ చేపడుతున్న ఈ వినూత్న కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలవనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొదటి రోజు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయ బృందం రజిత (SGT), హిమాబిందు,(SGT) సురేష్,(SGT) ముస్తాక్,(SA మ్యాథ్స్), శ్రీనయ్య (SA సోషల్), శ్రీకాంత్ (SA సోషల్), సుష్మిత (SA సైన్స్), వెంకటయ్య(SA SOCIAL), శ్రీనివాస్ (సైకాలజిస్ట్), ఫస్సియొద్దిన్(మ్యాథ్స్) తదితరులు ఉన్నారు.









## వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- తెలంగాణలో రాజకీయ మార్పు అనివార్యం..
- రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు



హైద్రాబాద్ : తెలంగాణలో రాజకీయ మార్పు అనివార్యమని, రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర అసంతృప్తి తో ఉన్నారని, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందనే భావన రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తమవుతోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీని ఆశాజనక శక్తిగా చూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం సరైన పరిష్కారం చూపలేకపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, అదే బీజేపీకి బలంగా మారుతోందని చెప్పారు. బీజేపీ కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో ప్రజల మధ్య ఉండి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చిన బండి సంజయ్, రాబోయే ఎన్నికల్లో కమలం జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయని, ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బండి సంజయ్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు

హైదరాబాద్ : తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం.తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

## నిరంజన్ రెడ్డిని విమర్శించే నైతికత మేఘారెడ్డికి ఎక్కడిది

**కె.ఎల్.ఐ పంపుల ప్రారంభం ముమ్మాటికి బి. ఆర్.ఎస్ విజయం.**
**ఆంధ్రా ప్రయోజనాలు కాపాడడం కోసం రేవంత్ ఆరాటం.**



వనపర్తి : కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన ఎల్లూరు,జొన్నల భోగడ,గుడిపల్లి రిజర్వాయర్ల నుండి సాగు జలాలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు. మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డి అవగాహన రాహిత్యంతో ప్రకటనలు విడుదల చేస్తూ ప్రజలలో చులకన అవుతున్నారని ఆరోపించారు. నిరంజన్ రెడ్డికి ప్రాజెక్టుల మీద ,సాగు జలాల మీద అవగాహన లేదని ఎమ్మెల్యే మాట్లాడడం హాస్యాస్పదం అని అన్నారు. కె.సి.ఆర్ గారు నిరంతరం రైతుల సంక్షేమం కోసం జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యతను ముందే పసిగట్టి రియర్వాయర్లు నింపి పంటలు పండించి సస్యశామలం చేశారని కానీ నేటి ప్రభుత్వం ఆంధ్రా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడం కోసం ఉన్న సాగు జలాలు వినియోగించుకోవడంలో దారుణంగా విఫలమైందని విమర్శించారు. మహారాష్ట్ర,కర్ణాటక నుండి జూరాల ప్రాజెక్టుకు 2లక్షల 30వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని వరద నీటిని సద్వినియోగం చేసుకొని రిజర్వాయర్స్ నింపి వర్షాకాలం,యాసంగి పంటలకు సాగు నీళ్లు ఇవ్వాలని గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్,నందిమల్ల.అశోక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వానివి తప్పుడు అవగాహన లేని ప్రకటనలు. మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి నార్లపూర్ రిజర్వాయర్ ముట్టడి చేస్తామని హెచ్చరించిన తర్వాత ఎల్లూరు, జొన్నల భోగడ గుడిపల్లి రిజర్వాయర్ లలో మూడు పంపులు ప్రారంభించామని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. ఎల్.సి.ఓ పేరిట కె.ఎల్.ఏ నుండి ఒక పంపు మాత్రమే ప్రారంభించి పంపులు ఆన్ చేశామనడం ప్రభుత్వ అవివేకం అని అన్నారు. నీళ్ల మీద, రైతుల మీద, వ్యవసాయం మీద బాధ్యత, మమకారం, సోయి లేని సన్నాసులకు సమాచారం కోసం నిన్న బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 11న నార్లాపూర్ ముట్టడిస్తామని హెచ్చరికలు చేసిన తరువాతే కాలువలకు నీళ్లు వదిలారు. ఇప్పటికీ కూడా గుడిపల్లి రిజర్వాయర్ లో నీళ్లు ఎత్తిపోస్తున్నారు. కానీ కాలువలకు ఈ క్షణం వరకు వదల్లేదు. బీఆర్ఎస్ హెచ్చరికల తరువాతనే ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిలలో మోటార్లు ఆన్ చేశారు. తాగునీటి కోసమే ఎల్లూరు, గుడిపల్లి, జొన్నలబొగుడ రిజర్వాయర్లు నింపేందుకు ప్రయత్నించారు. కానీ రైతులకు సాగునీరు ఇవ్వడానికి కాదు. ఇప్పటికి కూడా ఎక్కడా రైతులకు సాగునీరు విడుదల చేయడం లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి కేఎల్ఐ పరిధిలోని 500 చెరువులు, కుంటలు వెంటనే నింపాలి. రైతులకు సాగునీరు అందించాలి. బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలోనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో మోటార్లు ఆన్ చేసింది. నిన్న సాయంత్రం వరకు ఎల్లూరు, జొన్నలబొగుడలలో నడిచింది ఒక్కటే మోటరు. ప్రస్తుతం కూడా జొన్నల బొగుడలో ఒక్కటే మోటారు నడుస్తుంది. గుడిపల్లిలో ఈ క్షణం వరకు నీళ్లు విడుదల చేయలేదు. బీఆర్ఎస్ హెచ్చరికలతో కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. 2వందల రోజుల పాటు పంపులు నడిచే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా వానకాలం యాసంగి పంటలకు సాగు నీళ్లు అందించాలని గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల.అశోక్ డిమాండ్ చేశారు. ఈ సమావేశములో కె.మాణిక్యం,గంధం.పరంజ్యోతి, ఉంగ్లం.తిరుమల్,ధర్మశాస్త్ర,మహేశ్వర్ రెడ్డి, జోహెబ్ హుస్సేన్,సయ్యద్.జమీల్, పాండు తదితరులు ఉన్నారు.

## వివాదాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే

అదిలాబాద్ : కొన్ని పత్రికల్లో ప్రచురితమైన అవినీతి , అక్రమాల కథనాలను మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తన వ్యక్తిత్వ హననానికి, రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు రాజకీయ ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గానీ తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. ఇసుక, భూముల వ్యాపారాలకు ఎప్పుడూ దూరంగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై అసత్య కథనాలు రాస్తున్న వ్యక్తులు, సంబంధిత పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.ప్రధానంగా ప్రచారంలో ఉన్న రూ. 450 కోట్ల బ్యాంక్ రుణాల వ్యవహారంపై ఎమ్మెల్యే పక్కా ఆధారాలతో క్లారిటీ ఇచ్చారు. 2009-10 కాలంలో సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేర్లపై బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని, అవి తాను సొంతంగా సృష్టించిన పత్రాలు కావని తెలిపారు. 2014 నుంచి 2025 వరకు కంపెనీ ద్వారా వినియోగించిన మొత్తం నిధులు రూ. 109 కోట్ల 11 లక్షలు మాత్రమేనని, అన్ని బ్యాంకులు కూడా అదే మొత్తాన్ని ఎన్‌పీఏ గా గుర్తించాయని వివరించారు. ఒకవేళ రూ. 450 కోట్ల మేర మోసమే జరిగి ఉంటే బ్యాంకులు కేవలం రూ. 109 కోట్లకు ఆస్తులను ఎలా వేలం వేస్తాయని ఆయన ప్రశ్నించారు.రుణ చెల్లింపులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, 2014 నుంచి 2025 మధ్య కాలంలో బ్యాంకులకు ఇప్పటికే రూ. 44 కోట్ల 81 లక్షలు చెల్లించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

**ఆయిల్ పామ్ సాగుతో కూడా మంచి ఆదాయం.**
**ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కురిసే అవకాశం తక్కువ**
**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**




(సమయం ప్రతినిధి, జోగులాంబ గద్వాల) : ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వరద ఊవస్తున్నప్పటికీ ఆ నీటిని జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, ఊచెరువులు నింపుకొని తాగునీటి అవసరాలకు ఊప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ వరద తగ్గుముఖం పడితే కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల చేసే విషయంపై స్పష్టత లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ఈనెల 7న హైదరాబాదు నుంచి పలువురు మంత్రులు, అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వరద నీటితో ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపుతున్నట్లు తెలిపారు. కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు మినుములు, కూరగాయలు, తదితర ఆరుతడి పంటలతో కూడా రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భరత పప్పు దినుసుల పథకం కింద సబ్సిడీకి కందులు, మినుముల విత్తనాలు అందజేస్తున్నందున జిల్లా రైతులు తమ సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడులలో నిత్యం రెండు ఇంచుల నీళ్లు నిలువ చేయాల్సి వస్తుందని, కాబట్టి తక్కువ నీటితో పండించుకునే ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. పంటల వైవిధ్యంతోనే నేల సారవంతత కూడా పెరుగుతుందని, పంట మార్పిడి విధానాలు రైతులకు మేలు చేస్తాయని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేశారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగుకు పందిరి నిర్మించుకునేందుకు ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున, యూనిట్ కు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్ పామ్ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యన అంతర పంటలుగా మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలతోనూ లబ్ధి పొందవచ్చన్నారు. పామ్ గెలలు నాలుగో సంవత్సరం నుంచి వస్తాయని, అప్పుడు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి మొక్కలను అందజేయడంతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వరి వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్న పామ్ తోటలతో ఆర్థిక పురోగతి సాధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## వనపర్తి నియోజకవర్గ పరిధిలో పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యం



**మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఛాంబర్‌లో**
**వనపర్తి నీటిపారుదల అంశాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం**
**వారం రోజుల్లో సమగ్ర నివేదికలు..**
**ఇవ్వాలని సూచించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

వనపర్తి. సమయం ప్రతినిధి : వనపర్తి నియోజకవర్గంలోని నీటిపారుదల రంగానికి సంబంధించిన వివిధ సమస్యలు, పెండింగ్ పనులు, అవసరమైన కొత్త పనులకు ప్రపోజల్ పై, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపై శనివారం హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాంబర్‌లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ సమీక్ష సమావేశంలో పాల్గొనలేకపోయారు. ఈ నేపథ్యంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో నియోజకవర్గానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సవివరంగా చర్చించారు. వనపర్తి నియోజకవర్గంలో రైతులకు సాగునీటి పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సాగునీటి వనరులకు సంబంధించిన సమస్యలను గుర్తించి ప్రతి అంశంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని వనపర్తి నియోజకవర్గ పరిధిలోని పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలనీ అధికారులకు సూచించారు. నివేదికలు అందిన వెంటనే వాటిని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రైతులకు ప్రయోజనం కలిగేలా ఆయా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ సీఈ రహీమ్‌ద్దీన్, ఎస్ఈ చంద్రశేఖర్, డీసీ వెంకట్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## జైల్ భరో విజయవంతం చేయాలి..లేబర్ కోడులను రద్దు చేసేదాకా పోరాటం

**-ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష**




వనపర్తి, సమయం ప్రతినిధి : దేశంలో 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో తెచ్చిన 4 కోడులను రద్దు చేసేందుకు ఆగస్టు 10న జై భరోకు వామపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని అన్ని ప్రజా సంఘాలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష కోరారు. శనివారం ముఖ్య నేతలతో మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. లేబర్ కోడుల రద్దు ద్వారా సంఘం హక్కు, సమ్మె హక్కును హరించిందన్నారు. కార్మికులు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న రోజుకు 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. కార్మికుల శ్రమను పారిశ్రామికవేత్తలకు దోచి పెట్టేందుకే లేబర్ కోడులు రద్దుతో 12 గంటలకు పెంచిందని సమ్మె హక్కును కాలరాచిందన్నారు. లేబర్ కోడుల రద్దు కోసం కార్మికులు సుదీర్ఘ పోరాటం సాగిస్తున్నామన్నారు. అందులో భాగంగానే 10న జైలు బరో చేపట్టామన్నారు. కార్మికులనే కాక అమెరికాతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం ద్వారా రైతులకు అన్యాయం చేసిందన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చి, కేంద్ర వాటాను 90% నుంచి 40 కి తగ్గించి గ్రామీణ కూలీల కడుపు కొట్టిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి హామీ అవకాశాలను కల్పించడంలో విఫలమైందన్నారు. పేపర్ల లీకేజీ తో నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ఆడుకుందన్నారు. అందువల్ల జైలు బరో లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని కేంద్రం మెడలు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వి నాదం మాట్లాడుతూ..ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడక మెట్ట పంటలన్నీ పోయాయన్నారు. వరి పంట వేసుకునేందుకు మాత్రమే అవకాశం ఉందని, నకిలీ విత్తనాలు నకిలీ ఎరువులతో రైతులను వ్యాపారులు మోసం చేస్తున్న ప్రభుత్వానికి పట్టటం లేదన్నారు. ఎరువులు ధరలు పెంచారని, పంట మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేదన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రానికి బుద్ధి చెప్పేందుకు తాము జైలు భరోలో పాల్గొంటామని రైతులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వినాదం, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నకురుమన్న, డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణలో ప్రధానోపాధ్యాయులదే కీలక బాధ్యత

## విద్యార్థులను సన్మార్గంలో నడిపించాలి: జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ అస్రాఖాద్రి



మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి): బాలల హక్కుల పరిరక్షణతో పాటు లింగ సమానత్వాన్ని పెంపొందించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సమగ్ర శిక్ష జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ శ్రీమతి అస్రాఖాద్రి అన్నారు. విద్యార్థులను క్రమశిక్షణతో సరైన మార్గంలో నడిపిస్తూ విలువలతో కూడిన జీవితాన్ని అలవాటు చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుల ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు. యవ్వన దశలో విద్యార్థులు పక్కదారి పట్టే అవకాశం ఉన్నందున వారిని సన్మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. పాఠశాలల్లో ప్రతినెలా గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లు, బాయ్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్లు అర్థం చేసుకుని వారికి తగిన మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ అందించాలని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు న్యాయశాఖతో చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు జిల్లా న్యాయశాఖ ద్వారా విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించే సమావేశాలకు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు.

## కేబినెట్ ప్రక్షాళన కు లైన్ క్లియర్

హైదరాబాద్ : తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కేబినెట్ కొలువుదీరలేదు. రెండు స్థానాలు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వీటిని ఎప్పుడు భర్తీ చేస్తారా.. అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై అడుగులు ముందుకు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొంతకాలంగా క్యాబినెట్‌ను పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం ఒక సురక్షితమైన మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అసంతృప్తులకు తావివ్వకుండా, కేవలం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులను మాత్రమే భర్తీ చేసి ప్రస్తుతానికి రాజకీయాన్ని చల్లబరిచేందుకు ఏఐసీసీ సిద్ధమైంది. వారం, పది రోజుల్లో, అంటే ఈ నెల 14వ తేదీ తర్వాత చిన్నపాటి విస్తరణపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

## ఉడందాపూర్‌కు పర్యాటక కళ!

**సోమశిల-ఆలంపూర్ ప్రత్యేక పర్యాటక ప్రాంతంలో చోటు.. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృషికి సర్కారు సానుకూల స్పందన**
**జీరో అవర్‌లో ప్రస్తావనకు ఫలితం, సమగ్ర మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధికి శ్రీకారం**



జడ్చర్ల , ఆగస్టు 8, సమయం ప్రతినిధి : జడ్చర్ల నియోజకవర్గంలోని ఉడందాపూర్ రిజర్వాయర్‌కు పర్యాటక హంగులు అద్దేందుకు మరో ముందడుగు పడింది. రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఉడందాపూర్‌ను ప్రతిపాదిత లిసోమశిల-ఆలంపూర్ ప్రత్యేక పర్యాటక ప్రాంతం (ూూూ)లిలో భాగంగా చేర్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

**జీరో అవర్‌లో ప్రస్తావన**

2026 మార్చి 26న తెలంగాణ శాసనసభలో జీరో అవర్‌లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఉడందాపూర్ రిజర్వాయర్‌కు ఉన్న పర్యాటక అవకాశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ.. ఉడందాపూర్ రిజర్వాయర్‌ను ప్రతిపాదిత సోమశిల-ఆలంపూర్ ప్రత్యేక పర్యాటక ప్రాంతంలో చేర్చినట్లు తెలిపింది.

**మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం**

ప్రత్యేక పర్యాటక ప్రాంతానికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్‌ల రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోందని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రతిపాదనకు పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి ఆమోదం కూడా లభించినట్లు వెల్లడించింది.

**ఉపాధి అవకాశాలకు ఊతం**

ఉడందాపూర్ రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందితే జడ్చర్ల నియోజకవర్గానికి పర్యాటకపరంగా ప్రత్యేక గుర్తింపు లభించే అవకాశం ఉంది. పర్యాటకుల రాక పెరగడంతో స్థానికంగా వ్యాపార కార్యకలాపాలు ఊపందుకోవడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు, స్థానిక ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది. ప్రజల ఆకాంక్షను శాసనసభ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉడందాపూర్‌కు ప్రత్యేక పర్యాటక ప్రాంతంలో చోటు కల్పించేలా కృషి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చొరవపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జూరాల చివరి ఆయకట్టు వరకు వానకాలం వరి సాగుకు సాగు నీరు అందించాలి

**రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి**

సమయం ప్రతినిధి : తెలంగాణ రైతు సంఘం (AIKS) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూరాల ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ ను రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికల్లో రైతులతో మాట్లాడుతూ జూరాల లెఫ్ట్ కెనాల్ ద్వారా వానకాలం వరి సాగు కోసం నీరు వదలడం సాధ్యం కాదని చెప్పడం ద్వారా, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే లెఫ్ట్ కెనాల్ కింద వరి నాట్లు ముమ్మరంగా రైతులు వేయడం జరుగుతుంది. కాలువ ద్వారా మరికొంతమంది రైతులు తుకాలు పోయడం జరుగుతుంది. ఈ సమయంలో ఇలాంటి మాటలు అధికారులు మాట్లాడడం ద్వారా రైతులు ఆందోళనకు గురవుతున్నరని ఆందోళన వ్యక్తం చెశారు. కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాములు ఇప్పటికే నిండి అలుగులు పారుతున్న ప్రస్తుతపరిస్థితుల్లో ఇలా చెప్పడం సరైన పద్ధతి కాదని, ఒకవేళ వరి సాగుకు నిళ్లు సరిపోకపోయినపక్కన నున్న కర్ణాటక లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కాబట్టి వారితో మాట్లాడి వానకాలం వరి సాగు కు చివరి ఆయకట్టు వరకు నీరు అందించే విధంగా తెలంగాణ లోని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జూరాల డ్యామ్ లో 9 టీఎంసీల సామర్థ్యం ఉన్నప్పటికీ ఒండ్రు మట్టి రాళ్లు పేరుకు పోవడం ద్వారా ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకోకపోవడం వల్ల నష్టం జరుగుతుందని, భవిష్యత్తులో ఈవండ్రు పూడికగతీత పనులు చేపట్టాలని జూరాల ఎత్తును పెంచి 15 టీఎంసీల నీళ్లు నిల్వ ఉండే విధంగా కొత్తగా డిజైన్ చేయాలని, కర్ణాటకలో ముంపు కు గురవుతున్న ప్రాంతాలకు నష్ట పరిహారం చెల్లించి, శాశ్వత పరిష్కారం ఉండే విధంగా ప్రయత్నం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భన లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎస్ గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్,సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శు లు ఆర్ఎన్ రమేష్, మండ్ల రాజు, సిఐటియు నాయకులు ఎస్ రాజు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ వార్

హైదరాబాద్ : రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు. అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.

# యువత సరికొత్త ఆవిష్కరణలతో వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి: డీకే అరుణ








**మహబూబ్‌నగర్, ఆగస్టు 8 : (సమయం ప్రతినిధి):** యువత సరికొత్త ఆలోచనలు, పరిశోధనలు, ఆవిష్కరణలతో వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. గొప్ప ఆలోచనలకు పాలమూరు విశ్వవిద్యాలయం వేదికగా నిలవాలని అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కన్వా శాంతివనంలో నిర్వహించిన 'విజన్ ఇండియా 2047: ఇంటిగ్రేటింగ్ సైన్స్, ఇన్నోవేషన్ అండ్ యూత్ ఎంపవర్మెంట్' రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే యువశక్తి, శాస్త్రీయ నైపుణ్యం, నూతన ఆవిష్కరణలను సమర్థంగా

## PM-USHA పథకం కింద రూ.100 కోట్ల గ్రాంట్ సాధించిన పాలమూరు యూనివర్సిటీ

వినియోగించుకోవాలని ఆమె అన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం తరగతి గదులు, పరీక్షలు, పట్టాలకే పరిమితం కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, సామాజిక మార్పుకు కేంద్రాలుగా మారాలని సూచించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, సాంకేతికత, ఉపాధి రంగాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని ఒక సమస్యకు పరిష్కారం చూపే ఆలోచన కూడా పెద్ద ఆవిష్కరణకు, స్టార్టప్‌కు నాంది కావచ్చని అన్నారు. పీఎం-ఉషా (ప్రధానమంత్రి ఉన్నతతర విద్యా అభియాన్) పథకం కింద తెలంగాణలోనే ఏకైక విశ్వవిద్యాలయంగా పాలమూరు విశ్వవిద్యాలయానికి రూ.100 కోట్ల భారీ గ్రాంట్ లభించడం గర్వకారణమని డీకే అరుణ పేర్కొన్నారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలను అభివృద్ధి చేయడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువతను కేవలం ఉద్యోగాల కోసం కాకుండా సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు చూపే ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దాలని ఆమె అన్నారు. మహిళలకు పరిశోధన, సాంకేతికత, వ్యాపార రంగాల్లో నాయకత్వ అవకాశాలు కల్పించాలని సూచించారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తేనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని డీకే అరుణ అన్నారు. 2047 అనేది కేవలం ఒక సంవత్సరం కాదని, ప్రతి ఒక్కరి బాధ్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. రెండు రోజుల జాతీయ సదస్సు పాలమూరు విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిందని ఆమె అన్నారు. సదస్సును విజయవంతం చేసిన నిర్వాహక కమిటీ, అధ్యాపకులు, ప్రతినిధులు, విద్యార్థి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణను పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఘనంగా సన్మానించారు.

# ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దు

## ఆగస్టు 10లోగా ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి: కలెక్టర్



**రంగారెడ్డి జిల్లా, (సమయం ప్రతినిధి):** అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదని, అనర్హుల పేర్లు ఉండకూడదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి అన్నారు. SIR-2026లో భాగంగా ఓటరు జాబితాను పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో SIR ప్రక్రియపై సమీక్షించారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో ఎన్యుమరేషన్ ఫారాల్లోని తప్పులను సరిచేసి, డిజిటలైజేషన్‌ను ఆగస్టు 10లోగా పూర్తి చేయాలని సూచించారు. ముసాయిదా జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు స్వీకరించి, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఓటర్ల సంఖ్య, ప్రాంత పరిస్థితులను బట్టి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ చెప్పారు. అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, తక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలను విలీనం చేయడం, కేంద్రాల స్థల మార్పు వంటి అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. గేటెడ్ కమ్యూనిటీలకు సమీపంలోనూ ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. SIR ప్రక్రియలో రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# రేవంత లెక్కలోకి బనకచర్ల ప్రాజెక్ట్ రిజెక్ట్..

హైదరాబాద్, ఆగస్టు 8 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం?బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ వెనక్కి పంపడంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తమ నేత రేవంత్ రెడ్డి సాధించిన దౌత్యపరమైన విజయంగా ప్రచారం చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక దశలోనే విఫలమైందంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. అయితే, ఈ రాజకీయ క్రెడిట్ వార్, ప్రతివిమర్శలకు ఆవల సాంకేతిక, చట్టపరమైన కోణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఇది ఒకరికి లభించిన విజయమో లేదా మరొకరికి ఎదురైన ఓటమో కాదని.. నదీ జలాల చట్టాలకు అనుగుణంగా జరిగిన ఒక సహజ సిద్ధమైన పరిణామమని స్పష్టమవుతోంది.పర్యావరణ అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే, ఏ భారీ నదీ అనుసంధాన ప్రాజెక్టుకైనా ఒక స్పష్టమైన చట్టబద్ధమైన కార్యాచరణ ఉంటుంది. కేంద్ర జల సంఘం ద్వారా శాస్త్రీయంగా నీటి లభ్యత ధృవీకరణ పొందకుండానే పర్యావరణ అనుమతుల కోసం వెళ్లడం సాంకేతికంగా సరికాదు. చట్టబద్ధమైన ప్రాథమిక అనుమతులు లేకుండా ముందుకెళితే, భవిష్యత్తులో గ్రీన్ ట్రిబ్యునల్ లేదా సుప్రీంకోర్టు పరిధిలో పిటిషన్లు దాఖలై ప్రాజెక్టుపై శాశ్వత స్టే వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి కేంద్రం ఈ ప్రతిపాదనలను తిరస్కరించి వెనక్కి పంపడం అనేది ప్రాజెక్టుకు మున్ముందు చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా నిరోధించే ఒక ముందస్తు చర్యగా పరిగణించవచ్చు.గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలు , అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం ఎగువ , దిగువన ఉన్న ప్రతి ఒక్క రాష్ట్ర ప్రయోజనాలను రక్షించాల్సిన రాజ్యాంగ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఏపీ రూపొందించిన ప్రస్తుత ప్రాజెక్టు డిజైన్ ద్వారా తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కూడా ముంపు ముప్పు, నీటి కేటాయింపులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గోదావరి బేసిన్ నుంచి సముద్రంలోకి వెళ్లే మిగులు, వరద నీటి పరిమాణాన్ని శాస్త్రీయంగా లెక్కించి, వాటాలపై స్పష్టత ఇచ్చే వరకు సీడబ్ల్యూసీ లేదా ఈఏసీ అనుమతులు మంజూరు చేయడం అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టాలకు విరుద్ధమవుతుంది.రాజకీయంగా ఇది కూటమి ప్రభుత్వానికి బ్రేక్ పడటంలా అనిపించినప్పటికీ, సుదీర్ఘ కాలంలో ఈ ప్రాజెక్టుకు లభించే లీగల్ సెక్యూరిటీగా దీన్ని చూడవచ్చు. క్షేత్రస్థాయి ముంపు వివరాలు , నీటి కేటాయింపులపై పక్కా నివేదికలు లేకుండా ముందుకెళ్లడం వల్ల చట్టపరమైన పునాది బలహీనపడేది. పొరుగు రాష్ట్రాలతో సమగ్ర సంప్రదింపులు జరిపి, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకున్న తర్వాతే సీడబ్ల్యూసీ నీటి లభ్యత ధృవీకరణ పత్రంతో మళ్లీ పర్యావరణ అనుమతులకు రావాలని కేంద్రం సూచించడం ద్వారా ప్రాజెక్టుకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లభించింది.రాయలసీమ దాహార్తిని తీర్చేలా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద నీటిని తరలించి, దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడం ఏపీకి అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఇటువంటి మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోవాలంటే తొందరపాటు నిర్ణయాలు, పొలిటికల్ అజెండాల కంటే చట్టబద్ధమైన అడుగులే శ్రీరామరక్ష. సాంకేతిక లోపాలను సరిదిద్ది, అంతర్రాష్ట్ర సంప్రదింపులు పూర్తి చేసి చట్టబద్ధంగా ముందుకెళ్తేనే ఈ ప్రాజెక్టుకు శాశ్వత మనుగడ సాధ్యమవుతుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పొలిటికల్ విక్టరీగా చూపుతున్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం ఎదుర్కొన్నది సాంకేతిక ప్రతిబంధకాన్ని మాత్రమే గానీ ప్రాజెక్టు, రద్దును కాదు. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా సీడబ్ల్యూసీ నివేదికను సిద్ధం చేసుకుని, పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగితేనే పోలవరం?బనకచర్ల అనుసంధానం సుసాధ్యమవుతుంది. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, నిబంధనల ప్రకారం లీగల్ బ్యాకప్‌తో ఏపీ ప్రభుత్వం ముందడుగు వేయడమే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుకు అత్యంత సురక్షితమైన మార్గం.

# 100 ఎకరాల్లో బస్ డిపో

హైదరాబాద్, ఆగస్టు 8 : హైదరాబాద్‌లో ట్రాఫిక్ పెరుగుతోంది.. ఎక్కడికక్కడే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసినా సరే ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలుతో పాటుగా ఆర్టీసీ ప్రజా రవాణా అందుబాటులో ఉన్నా సరే ట్రాఫిక్ కష్టాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ నగరంలో వాహనాలకు తోడు తెలంగాణ లోని ఇతర జిల్లాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆర్టీసీ బస్సులు నగరానికి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల కోసంఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లు ఉన్నాయి.. అయినా సరే ఒత్తిడి ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.. టీజీఎస్‌ఆర్టీసీ 100 ఎకరాల్లో అత్యాధుని క బస్ టెర్మినల్‌ను ప్లాన్ చేసింది. తాజాగా ఈ డిపోకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ జగద్గిరిగుట్ట దగ్గర బస్ డిపో నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం దగ్గర 100 ఎకరాలు కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజూ 404 ట్రిప్పుల వరకు తిరుగుతాయన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్ డిపో, టెర్మినల్ నిర్మాణం కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని గుర్తించిందన్నారు.కానీ హెచ్‌ఎంటీ అధికారులు.. అంత సుదీర్ఘకాలం స్థలాన్ని లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. దీని కోసం ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పగా.. ఆ ప్రతిపాదనకు టీజీఎస్‌ఆర్టీసీ అంగీకరించలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీకి గాజులరామారం దగ్గర హెచ్‌ఎంటీ భూములకు సమీపంలో 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. గాజుల రామారంలో ఏర్పాటు చేయబోయే డిపోలో ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు.

# డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన వద్దు

## నోటీసు అందిన వారు మాత్రమే సంబంధిత పత్రాలు సమర్పించాలి



**రంగారెడ్డి జిల్లా, (సమయం ప్రతినిధి):** డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు కనిపించకపోయినా ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. నోటీసు అందినంత మాత్రాన ఓటరు పేరు తుది జాబితా నుంచి తొలగించినట్లు కాదని అధికారులు తెలిపారు. SIR-2026 ప్రక్రియలో భాగంగా సంబంధిత కారణాలతో నోటీసులు అందుకున్న ఓటర్లు మాత్రమే తమ అర్హతను నిరూపించేందుకు అవసరమైన పత్రాలను సంబంధిత ఏఈఆర్‌ఓకు సమర్పించాలని సూచించారు. పత్రాల స్వయంగా ధృవీకరించిన ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్, విద్యా ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, కుటుంబ రిజిస్టర్, భూమి లేదా ఇంటి కేటాయింపు పత్రాలు తదితరాలను నిబంధనల మేరకు సమర్పించవచ్చని అధికారులు పేర్కొన్నారు. 1987 జూలై 1కి ముందు జన్మించిన వారు తమ జనన తేదీ లేదా జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలి. 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి జనన వివరాలకు సంబంధించిన పత్రాన్ని సమర్పించాలి. 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమతో పాటు తల్లిదండ్రుల జనన తేదీ, జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. విదేశాల్లో జన్మించిన వారు భారత రాయబార కార్యాలయం లేదా మిషన్ జారీ చేసిన జనన నమోదు ధ్రువీకరణ ఆధారాలను, రిజిస్ట్రేషన్ లేదా నేచురలైజేషన్ ద్వారా భారత పౌరసత్వం పొందిన వారు సంబంధిత పౌరసత్వ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని అధికారులు తెలిపారు.

**ప్రతి ఒక్కరూ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదు**

డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేని ప్రతి ఒక్కరూ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. సంబంధిత ఏఈఆర్‌ఓ నుంచి నోటీసు అందుకున్న వారు మాత్రమే నోటీసులో పేర్కొన్న సూచనల మేరకు పత్రాలను సమర్పించాలని సూచించింది.నోటీసు అందిన ఓటర్లు ఆందోళన చెందకుండా సంబంధిత ఏఈఆర్‌ఓను సంప్రదించి, నిర్ణీత విధానంలో అవసరమైన పత్రాలను సమర్పించాలని అధికారులు కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పారదర్శకంగా SIR-2026 ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# జడ్చర్లలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటించాలి: అదనపు కలెక్టర్



**మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి):** జడ్చర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వలు, జాతీయ రహదారి, కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శనివారం పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

# తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన

విజయవాడ : రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ ప్రక్షాళన అంశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక ప్రభుత్వం కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం అధికార వర్గాలు, రాజకీయ విశ్లేషకుల మధ్య జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పనితీరుపై స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ వ్యాఖ్యలను భవిష్యత్‌లో జరిగే మంత్రివర్గ మార్పులకు సంకేతాలుగా పలువురు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక ఎన్నికలను అత్యంత కీలకంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రతిపక్ష విమర్శలకు వెంటనే సమాధానం ఇవ్వాలని ఆయన సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు చేరకపోతే ఆశించిన రాజకీయ ఫలితాలు రావని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యంగా కొన్ని శాఖల్లో నిర్ణయాల అమలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఫైళ్ల పరిష్కారంలో జాప్యం కనిపించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం తగ్గడం వంటి అంశాలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాఖలపై పూర్తి పట్టు సాధించి ఫలితాలు చూపించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రులకు సూచించినట్లు సమాచారం. ప్రతి అంశంలో ముఖ్యమంత్రి జోక్యం అవసరం లేకుండా ఆయా శాఖల మంత్రులే ముందుండి పనిచేయాలని స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది.జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రుల బాధ్యతల విషయంలో కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. జిల్లాల్లో పార్టీ నాయకుల మధ్య సమన్వయం పెంచడం, అంతర్గత విభేదాలను తగ్గించడం, స్థానిక స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు చెబుతున్నారు.






# పోలీసు సిబ్బందికి 45 రోజుల కరాటే శిక్షణ ప్రారంభం



## స్వీయ రక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే ఉపయోగకరం: ఎస్పీ డి.జానకి


**మహబూబ్‌నగర్ (సమయం ప్రతినిధి):** పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు, స్వీయ రక్షణలో నైపుణ్యం సాధించేందుకు 45 రోజుల కరాటే శిక్షణను ప్రారంభించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కవాతు మైదానంలో ఎస్పీ డి.జానకి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్వీయ రక్షణ నైపుణ్యాలు ఆపద సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఇతరులను రక్షించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. కరాటే శిక్షణతో శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, త్వరిత నిర్ణయ సామర్థ్యం పెరుగుతాయని చెప్పారు. సిబ్బంది శిక్షణలో చురుగ్గా పాల్గొని కరాటే మెళకువలను పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని సూచించారు. 45 రోజుల శిక్షణలో స్వీయ రక్షణ పద్ధతులు, శారీరక వ్యాయామాలు, కరాటే మెళకువలు, ఆపద సమయాల్లో రక్షణకు సంబంధించిన శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ రమణారెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, ఆర్ఎస్ఐలు రమేష్, సత్యం, వన్‌టౌన్ ఎస్ఐ వసంతతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖ మంత్రిని కలిసిన దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్



హైదరాబాద్: మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలసి దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి, ఇందిరమ్మ ఇండ్ల L3 సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి సంబంధించిన ఫైనల్ రిపోర్ట్ ఇప్పటికే ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని, త్వరితగతిన కార్యాలయాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్యులను కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ విజ్ఞప్తి పై, మంత్రి వర్యులు శ్రీ. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న 166వ జయంతి వేడుకలు



**దేవరకొండ: ఆగస్టు 08 (సమయం ప్రతినిధి) :** దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న 166వ జయంతిలి వేడుకలు ఘనంగా జరిగినాయి. పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమ కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు ఉద్యమాలు ఒక చరిత్ర ఇతనే రాబిన్ హుడ్ గా తెలంగాణ ప్రజలకు పరిచయం ప్రజల నుంచి దోచుకుంటున్న సోమ్మ్ ను గుంజి పేద ప్రజలకు పంచిన వ్యక్తి పోరాడిన వ్యక్తి ఈయనను ఆదర్శంగా తీసుకొని బహుజనులందరూ ఐక్యమై పోరాటం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, సొల్లేటి భాస్కరాచారి ,పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్య ,ముదిరాజ్ సంఘం నాయకులు రాచమల్ల నాగయ్య ముదిరాజ్ తూటుపల్లి శీను ముదిరాజ్ ,రెడ్డి శంకర్ , గరిడ విజయభాస్కర్, భూతరాజు శ్రీధర్, జయప్రకాష్, హరి, కోప్పెర శీను, నీల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం పాలిటిక్స్ హీట్.. జేసీ వర్సెస్ కేతిరెడ్డి

అనంతపురం : అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ ఉత్కంఠ పీక్స్‌కు చేరింది. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ వైసిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే వైసిపి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరులో ఒక భారీ నిరసన దీక్ష చేపట్టేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం అదే నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరులో స్థానిక టీడీపీ కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.

# ప్లాన్ బీలో రేవంత్... కర్ణాటక ఎఫెక్ట్...

హైదరాబాద్, ఆగస్టు 8 : పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్తులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి ఉవని జి ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్తుల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత + కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్తులు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్. అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది.కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది. కర్ణాటక కేబినెట్ విస్తరణ గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పాలనకు ఒక ముందస్తు హెచ్చరిక లా పనిచేసింది. కేవలం కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పార్టీ పాతకాపులను గౌరవిస్తూ, రాజీనామాల వేడి తగ్గించే సమగ్ర ప్యాకేజీతోనే రేవంత్ రెడ్డి తన కేబినెట్ విస్తరణను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

జడ్చర్ల , ఆగస్టు 8,సమయం ప్రతినిధి జడ్చర్ల కావేరమ్మపేట చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో శ్రీరామ పాదుకా పట్టాభిషేకం నిర్వహించారు. పాదుకలు అయోధ్య నుంచి తీసుకువచ్చి కావేరమ్మపేటలో 20 రోజు ప్రతి ఇంటా పూజలందుకొని 21వ రోజు సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత శ్రీరామ పాదుక పట్టాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వక్త యోగేష్ ప్రభు మాట్లాడుతూ చిన్నప్పటినుండే విద్యార్థుల్లో భక్తి దేశభక్తి దైవభక్తి దైవచింతన ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంస్కృతి సంప్రదాయాలు విలువలు గౌరవాలు తమ పిల్లలకు తల్లిదండ్రులు తమ పిల్లలకు భక్తి భావన పెంచు మన సంస్కృతి సంప్రదాయాలు గౌరవించాలని గురువులకు గౌరవించు తమ తల్లిదండ్రులను గౌరవిస్తూ సమాజంలో తమ వంతు సేవా కార్యక్రమాలు విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. కావేరమ్మపేట హనుమాన్ చాలీసా బృంద సభ్యులు విశ్వహిందూ పరిషత్ సభ్యులు సంస్కార భారత సభ్యులు ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.



## వైజాగ్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్టే.. ఆ 35 కూడళ్లలో సరికొత్తగా!

విశాఖపట్టణం, ఆగస్టు 8 : వైజాగ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఇటీవల ఓ సర్వే కూడా నిర్వహించారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద అభివృద్ధి పనులు చేసి ట్రాఫిక్ సమస్యను రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఈ ప్రాంతానికి రావడానికే మొగ్గు చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్, నౌకాశ్రయం, స్టీల్‌ప్లాంట్ ఇలా అభివృద్ధికి కీలక మార్గాలన్నీ ఇక్కడే ఉండటంతో జనాభా పెరగడం, ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. దాతో ట్రాఫిక్ రద్దీకి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జాతీయ రహదారిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, వాహనాల సంఖ్య, తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ ఇటీవల సర్వే చేపట్టింది. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చారు.ఈ 35 కూడళ్లలో ప్రైవేట్ ఏజెన్సీతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి జీవీఎంసీ సిద్ధమైంది. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇక్కడ ప్రధానంగా సర్వీసు రహదారి ఏర్పాటు చేయడం.. ప్రస్తుతం ఉన్న ఫ్రీ లెఫ్టులను మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.వెంకోజీపాలెం వద్ద హెచ్‌బీ కాలనీకి వెళ్లే రహదారి విస్తరించడం, విశాఖ వ్యాలీ కూడలి వద్ద మరో సర్వీసు రహదారి నిర్మించడం, ఎండాడ వద్ద సర్వీసు రహదారి అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు అధికారులు తీసుకున్నారు. ఈ పనులను చేయడానికి త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సమావేశం కూడా నిర్వహించారు.జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల బృందం సర్వే ఆధారంగా ఒక అవగాహనకు వచ్చి అభివృద్ధి పనులు చేయట్టాలని నిర్ణయించారు.

# పంచ్‌ల వెనుక పోరాటం!



గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణపతకాలతో భారత్ గర్వపడేలా చేసిన మహిళా బాక్సర్లు.. కేవలం రింగులోనే కాదు.. నిజ జీవితాల్లోనూ అద్భుత విజయాలు సాధించారు. సినీ కథలకు తీసిపోని వారి పోరాట పటిమ, చిన్ననాటి ముచ్చట్లు, కుటుంబ త్యాగాలు, క్రీడా ప్రయాణం ఇది. *సమయం ప్రతినిధి*

## బాక్సింగ్ పసిడి ముత్యాలు

అరుంధతి చౌదరి- 70 కేజీలు (కోటా, రాజస్థాన్)
ప్రీతి పవార్-54 కేజీలు (భివానీ, హరియాణా)
సాక్షి చౌదరి - 51 కేజీలు (భివానీ, హరియాణా)
ప్రియా ఘంఘాస్- 60 కేజీలు
(భివానీ, హరియాణా)
ప్రియా ఘంఘాస్

### కుటుంబ త్యాగానికి నజరానా

హరియాణాకే చెందిన 20 ఏళ్ల ప్రియా ఘంఘాస్ ప్రయాణం.. ఒక మధ్యతరగతి కుటుంబం తమ కుమార్తె ఆశయం కోసం చేసిన మహోన్నత త్యాగం చుట్టూ తిరుగుతుంది. ప్రియకు 11 ఏళ్ల వయసు ఉన్నప్పుడు (2015లో) ఆమెలోని బాక్సింగ్ నైపుణ్యాన్ని తండ్రి మహేంద్ర ఘంఘాస్ గుర్తించారు. జాతీయ మాజీ ఛాంపియన్ రవి సాంగ్వాన్ వద్ద శిక్షణ ప్రారంభించిన ప్రియ.. మొదట్లో తన అన్నయ్య నీరజ్‌తో కలిసి ఇంట్లో, స్థానిక క్లబ్‌లలో సాధన చేసేది. ప్రియ ప్రతిభను గుర్తించిన తండ్రి ఆమెను భివానీలోని 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (సాయ్) బాక్సింగ్ అకాడమీలో చేర్పించాలని కలలు కన్నారు.

2022లో ప్రియకు అకాడమీలో సీటు లభించింది. సాధారణంగా హరియాణాలోని గ్రామీణ కుటుంబాలు తమ సొంత ఇల్లు, ఊరు వదిలి వెళ్లడానికి ఇష్టపడవు. కానీ మహేంద్ర తన కుమార్తె బాక్సింగ్ కల నెరవేర్చడం కోసం ఊరిని వదిలి కుటుంబంతోపాటు భివానీ నగరానికి వలస వచ్చేశారు. కుటుంబం చేసిన ఈ త్యాగం ప్రియపై పెద్ద బాధ్యతను ఉంచింది. కోచ్ మహావీర్ నేతృత్వంలో రాత్రింబవళ్లు శ్రమించిన ప్రియ.. 20 ఏళ్ల వయసులోనే ఆసియా ఛాంపియన్‌షిపలో ప్రపంచ ఛాంపియన్లను ఓడించి సంచలనం సృష్టించింది.

రింగ్‌లో పులిలా గర్జించే ప్రియ.. రింగ్ బయట మాత్రం ఎంతో సున్నితమైన పల్లెటూరి అమ్మాయి. ప్రాక్టీస్ క్యాంపుల నుంచి బ్రేక్ దొరికితే చాలు నేరుగా ఇంటికి వచ్చేస్తుంది. మూడేళ్ల క్రితం వీధిలో దొరికిన ఒక కుక్కపిల్లకు 'రాజా' అని పేరు పెట్టుకుని దానితో ఆడుకోవడం, బైక్‌పై లాంగ్ రైడ్స్ వెళ్లడం ఆమెకు ఎంతో ఇష్టం. అన్నింటికంటే ముఖ్యంగా అమ్మ చేతి 'చూర్మా' (హర్యానా ప్రత్యేక తీపి పదార్థం) తినడం అంటే ఆమెకు ప్రాణం. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో 60 కేజీల విభాగంలో కెనడా ప్రత్యర్థి మేరీ బాతూల్ అల్ అహ్మదియేపై 4-1 తేడాతో విజయం సాధించి తన కుటుంబ త్యాగానికి స్వర్ణ పతకంతో నజరానా అందించింది.

### అరుంధతి చౌదరి
### గణిత మేధావి.. రింగ్ విప్లవం

రాజస్థాన్‌లోని 'కోటా' అనగానే అందరికీ చప్పున స్ఫురించేది ఐఐటీ కోచింగ్‌లు, ఐఐటీ కలలే గుర్తొస్తాయి. అరుంధతి చౌదరి కథ కూడా అలాగే ప్రారంభమైంది. చిన్నప్పటి నుంచి చదువులో ఎంతో చురుగ్గా ఉండే అరుంధతికి.. ముఖ్యంగా గణితంలో అద్భుతమైన ప్రతిభ ఉండేది. కూతురి తెలివితేటలు చూసి ఆమెను ఎలాగైనా ఐఐటీలో చేర్పించి పెద్ద ఇంజనీర్‌ను చేయాలని ఆమె తండ్రి ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. కానీ అరుంధతి మనసు మాత్రం పుస్తకాల మధ్య కాకుండా క్రీడా మైదానంలో ఊగిసలాడేది. మొదట్లో బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేసిన ఆమె.. 15 ఏళ్ల వయసులో బాక్సింగ్ రింగ్ వైపు ఆకర్షితురాలైంది.

ఐఐటీ చదవాల్సిన కూతురు బాక్సింగ్ గ్లోవ్స్ తొడగడం తండ్రికి అస్సలు నచ్చలేదు. గల్లీ నుంచి జాతీయస్థాయికి వెళ్లడం అంత సులభం కాదని ఆయన భావించారు.

కానీ అరుంధతి తన పట్టుదలను వదల్లేదు. ఒకరోజు తల్లిముందు కన్నీళ్లు పెట్టుకుని తన క్రీడా కల గురించి చెబుతూ బతిమాలింది. కుమార్తె తపనను అర్థం చేసుకున్న తల్లి.. భర్తను ఒప్పించింది. ఇక అక్కడి నుంచి అరుంధతి

వెనుదిరిగి చూసుకోలేదు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ తన పంచ్‌ల పవర్‌తో తండ్రి నమ్మకాన్ని గెలుచుకుంది.

అయితే అరుంధతి ప్రయాణం ఎప్పుడూ పూలబాట కాదు. పారిస్ ఒలింపిక్ అర్హత టోర్నీ సమయంలో ఓటమిని ఎదుర్కొన్న అరుంధతి మానసిక వేదనకు గురైంది. దాదాపు రెండు నెలలపాటు గ్లోవ్స్‌ను పక్కన పడేసి ఆటకు దూరంగా ఇంట్లోనే ఉండిపోయింది. క్రీడా జీవితం ముగిసిపోయిందనుకున్న వేళ.. మళ్లీ తనలోని పట్టుదలను నిద్రలేపి ఫీనిక్స్ పక్షిలా కోలుకుని కమ్‌బ్యాక్ ఇచ్చింది. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో 70 కేజీల విభాగం ఫైనల్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన చాంటెల్ రీడ్‌ను 5-0తో ఏకపక్షంగా ఓడించి స్వర్ణాన్ని ముద్దాడింది. ప్రస్తుతం భారత సైన్యంలో హవల్దార్‌గా పనిచేస్తున్న అరుంధతి.. చదువుల ఒత్తిడిని అధిగమించి క్రీడల్లో స్వయం ప్రతిభను చాటుకున్న ఒక రోల్ మోడల్!

### ప్రీతి పవార్
### అయిష్టం నుంచి అత్యున్నత శిఖరానికి

హరియాణాలోని భివానీ నగరానికి భారత బాక్సింగ్ రంగంలో ఒక ప్రత్యేకత గుర్తింపు ఉంది. దానిని 'భారత బాక్సింగ్ నర్సరీ' అని పిలుస్తారు. అలాంటి ఊరి నుంచి వచ్చిన 23 ఏళ్లప్రీతి పవార్ కథ ఎంతో ఆసక్తికరం. ఆమె తండ్రి సోమ్‌వీర్ పవార్ హరియాణా పోలీస్ శాఖలో ఆఫీసర్‌గా పనిచేస్తుండగా, తల్లి శమీన్‌దేవి గృహిణి. క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టినప్పటికీ.. ప్రీతికి చిన్నతనంలో బాక్సింగ్ అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. పంచ్‌లు విసరడం, దెబ్బలు తిని రింగ్‌లో నిలబడటం అంటే భయపడేది.

అయితే మాజీ బాక్సర్ అయిన ఆమె బాబాయ్ వినోద్ పవార్.. ప్రీతిలోని శారీరక దృఢత్వం, ఫైటింగ్ స్పిరిట్‌ను గమనించారు. ఆమె తండ్రిని ఒప్పించి బలవంతంగా బాక్సింగ్ క్లబ్‌లో చేర్పించారు. ఎనిమిదేళ్ల క్రితం ప్రాక్టీస్ భరించలేక, ఆట నచ్చక బాక్సింగ్ మానేస్తానని పట్టుబట్టింది ప్రీతి. కానీ బాబాయ్ క్రమశిక్షణ, తండ్రి ప్రోత్సాహం ఆమె ఆలోచనా విధానాన్ని మార్చాయి. రోజుకు 6 నుంచి 8 గంటలు కఠోర సాధన చేస్తూ రింగ్‌ను తన సొంతం చేసుకుంది. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల 54 కేజీల విభాగంలో కెనడా బాక్సర్ స్కార్లెట్ డెల్గాడోపై 5-0తో తిరుగులేని విజయం సాధించి బాక్సింగ్‌లో భారత్‌కు మొదటి స్వర్ణ పతకాన్ని అందించింది. అంతేకాదు, క్రీడల్లో ఆమె సాధించిన విజయాలను గుర్తించిన భారత సైన్యం నేరుగా 'జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్'గా నియమించింది. భారత సైన్యంలో ఈ గౌరవాన్ని పొందిన తొలి మహిళా అథ్లెట్‌గా చరిత్ర సృష్టించిన ప్రీతి పవార్ ప్రయాణం .. కష్టపడితే అయిష్టమైన రంగంలోనూ అగ్రస్థానానికి చేరుకోవచ్చని నిరూపిస్తోంది.

### సాక్షి చౌదరి
### వీధి గొడవల రౌడీ

హరియాణాలోని భివానీ జిల్లా 'ధనానా' గ్రామానికి చెందిన 25 ఏళ్ల సాక్షి చౌదరి వ్యక్తిగత జీవితం ఒక సినిమాలా ఉంటుంది. చిన్నతనంలో సాక్షికి అమితమైన కోపం ఉండేది. బడిలో గానీ, వీధిలో గానీ ఎవరితోనైనా సరే ఇట్టే గొడవ పడేది. గొడవల్లో రోజూ ఎవరినో ఒకరిని కొట్టడం, ఊరి జనాలు ఆమెపై ఫిర్యాదు చేసేందుకు ఇంటికి రావడం సర్వసాధారమైపోయింది. కూతురిలోని ఈ అపరిమితమైన కోపాన్ని, ఆవేశాన్ని గమనించిన తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో తండ్రి మనోజ్ కుమార్ ఒక భిన్నమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. 2008 ఒలింపిక్స్‌లో విజేందర్‌సింగ్ సాధించిన విజయాన్ని చూసి స్ఫూర్తిపొందిన ఆయన "నా కూతురి చేతుల్లో ఉన్న దుమ్మును గల్లీల్లో కాకుండా రింగులో చూపిస్తాను" అని నిశ్చయించుకున్నారు. 2012లో (సాక్షికి 9 ఏళ్లు ఉన్నప్పుడు) ప్రసిద్ధ కోచ్ జగదీశ్ వద్ద బాక్సింగ్‌లో శిక్షణ కోసం చేర్పించారు. తండ్రి నమ్మకాన్ని నిలబెడుతూ సాక్షి రింగ్‌లో తన ఆవేశాన్ని ప్రత్యర్థులపై పంచ్‌ల రూపంలో కురిపించడం మొదలుపెట్టింది. అయితే సీనియర్ స్థాయిలో కెరీర్ కొనసాగుతున్న సమయంలో భుజం గాయాలు ఆమెను వేధించాయి. దీంతో రెండు పెద్ద టోర్నీలను కోల్పోవడంతో కెరీర్ ముగిసిపోయిందని అనుకున్నారు. కానీ సాక్షి వెనకడుగు వేయలేదు. ప్రస్తుతం భారత సైన్యంలో హవల్దార్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్న సాక్షి.. ఆర్మీ అందించిన కఠిన శిక్షణతో మానసికంగా మరింత దృఢంగా మారింది. ఒలింపిక్ పతక విజేత నిఖత్ జరీన్‌ను కామన్వెల్త్ ట్రయల్స్‌లో ఓడించి అర్హత సాధించిన సాక్షి.. గ్లాస్గోలో 51 కేజీల విభాగం ఫైనల్‌లో ఇంగ్లాండ్ అథ్లెట్ రూబీవైట్‌ను 5-0తో ఓడించి స్వర్ణం సొంతం చేసుకుంది. ఒకప్పుడు 'వీధిరౌడీ'గా పేరుతెచ్చుకున్న అమ్మాయి నేడు దేశ సరిహద్దులను కాపాడే సైనికురాలిగా, దేశానికి పసిడి తెచ్చిన చాంపియన్‌గా నిలవడం విశేషం.

# భవిష్యత్తుకు బాట వేస్తున్నారు

**ఇంటి ఖర్చుల కోసం చదువుకొంటూనే వ్యవసాయ కూలీగా పని చేశారు. చదువుకోవాలన్న తన ఆకాంక్షను పెళ్లి పేరుతో పెద్దలు మొగ్గలోనే తుంచేసినా... అవరోధాలు ఎన్ని ఎదురైనా... ఆమె ఎన్నడూ ఆత్మనిబ్బరాన్ని కోల్పోలేదు. దూర విద్యలో పలు డిగ్రీలు చదివి... నేడు తనలాంటివారికి అండగా నిలబడ్డారు. కోచింగ్ సెంటర్ పెట్టి... సమాజోద్ధరణకు సంకల్పించిన 29 ఏళ్ల ప్రియా నటరాజన్ జర్నీ ఇది.**



(సమయం ప్రతినిధి) : "ఒక వ్యక్తి భవిష్యత్తును పరిస్థితులు ఎన్నడూ నిర్ణయించకూడదు. నా అకాడమీ ద్వారా దీన్ని నిరూపించాలని అనుకొంటున్నా. విద్యకు జీవితాలను మార్చే శక్తి ఉంది. దాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా పని చేస్తున్నాను. ఎందుకంటే చదువు దూరం అయినప్పుడు బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు. ఆ బాధ మరే విద్యార్థి అనుభవించకూడదనేదే నా తాపత్రయం. ఆ ఉద్దేశంతోనే 'అవ్వయ్యార్ ఐఏఎస్ అకాడమీ' నెలకొల్పాను. దీని ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాను.

**వ్యవసాయ కుటుంబం...**

తమిళనాడు రాష్ట్రం పడలూర్‌లో వ్యవసాయ కుటుంబం మాది. ఊళ్లో మాకు రెండెకరాల పొలం ఉండేది. దానిపై వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు సరిపోయేది కాదు. అమ్మానాన్నలకు సాయంగా ఉంటుందని బడి సెలవుల్లో వ్యవసాయ కూలీగా పని చేసేదాన్ని. ఎన్ని ఇబ్బందులున్నా ఏ రోజూ బడి మానలేదు. బాగా చదువుకోవాలి. స్వశక్తితో ఎదగాలి. నచ్చిన రంగంలో స్థిరపడాలి... చిన్నప్పుడు ఇదే నా ఆకాంక్ష. కానీ విధి మరోలా తలచింది. పదో తరగతిలోకి వచ్చేసరికి ఇంట్లోవాళ్లు చదువు మానేయమన్నారు. అప్పుడే పెళ్లి వద్దని ఎంత చెప్పినా వినలేదు. ఎలాగా వారిని ఒప్పించి ఒక ఏడాది వాయిదా వేశాను.

**వద్దనుకున్నా తప్పలేదు...**

ఇల్లు వదిలేసి పెరంబలూరు ప్రభుత్వ పాఠశాలలో పదకొండో తరగతిలో చేరాను. హాస్టల్‌లో ఉంటూ చదువు కొనసాగించాను. ఏడాది అయిందో లేదో... ఇంటి నుంచి పిలుపు. 'నీకు పెళ్లి చేయాలి. తిరిగి వచ్చేసేయ్' అని. మరికొంత కాలం వాయిదా వేయమని వేడుకున్నాను. ఈసారి నా అభ్యర్థనను అమ్మానాన్నలు అస్సలు పట్టించుకోలేదు. బలవంతంగా పెళ్లి చేశారు. అత్తింటికి వెళ్లాను. వారిని ఒప్పించి చదువు కొనసాగించాలని ప్రయత్నించాను. అక్కడా నిరాశే ఎదురైంది. విషయం నా భర్తకు చెప్పాను. ఆయన నన్ను అర్థం చేసుకున్నారు. కానీ బయటకు పంపడానికి ఇష్టపడలేదు. ఇంటి పనులు చేసుకొంటూనే, దూర విద్య ద్వారా పలు డిగ్రీలు పూర్తి చేశాను.

**ప్రభుత్వ ఉద్యోగం కాదనుకొని...**

డిగ్రీ తరువాత ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఆ డబ్బుతో పోటీ పరీక్షలకు ఫీజులు కట్టుకున్నాను. ఉద్యోగం చేస్తూనే టీఎన్‌పీఎ?సీ లాంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. చివరకు నా ప్రయత్నం ఫలించింది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఎందుకో తెలియదు... ఆ క్షణం నా ఆలోచన మారిపోయింది. ఇన్నేళ్లూ దేని కోసమైతే కష్టపడ్డానో, ఏదైతే కోరుకున్నానో అది నెరవేరింది. కానీ అందులో సంతృప్తి లేదనిపించింది. నాలాగా నా చుట్టూ ఎంతోమంది అమ్మాయిలు ఉన్నారు. పరిస్థితుల కారణంగా తమ కలలను మధ్యలోనే వదిలేసి, నిస్సారమైన జీవితాన్ని గడుపుతున్నారు. వారికి అండగా నిలబడాలని నిర్ణయించుకున్నాను. ఆర్థిక స్థోమత లేని పిల్లలకు చేయూతనిచ్చి, ఉపాధి మార్గం చూపాలని అనుకున్నాను. అందుకే ప్రభుత్వ ఉద్యోగం వద్దనుకుని లక్ష్యం వైపు అడుగులు వేశాను.

**అకాడమీతో అవకాశాలు కల్పించి...**

ఏం చేసినా వ్యవస్థీకృతంగా ఉండాలి. నిరంతరం సేవలు అందించాలి. అలా 2022లో 'అవ్వయ్యార్ ఐఏఎస్ అకాడమీ' ప్రారంభించాను. 73 మంది విద్యార్థులతో మొదలైంది. ఏటికేడూ పెరుగుతూ నాలుగేళ్లలో ఆ సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ఇప్పటివరకు ఎనిమిది వేల మందికి పైగా పోటీ పరీక్షల కోసం మా అకాడమీలో శిక్షణ పొందారు. వారిలో దాదాపు మూడు వేల మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సంపాదించారు. వారిని చూస్తే నన్ను నేను చూసుకున్నట్టే ఉంటుంది. ఆత్మసంతృప్తి కలుగుతుంది. ఆర్థికంగా వెనుకబడినవారు, ఏ దిక్కూ లేనివారు, ఒంటరి మహిళలు, సింగిల్ పేరెంట్ ఉన్న పిల్లలకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వ్యవసాయ కుటుంబాల నుంచి వచ్చినవారైతే 25 శాతం ఫీజులో రాయితీ కల్పిస్తున్నా. మిగిలినవారి నుంచి నామమాత్రంగా తీసుకొంటున్నా. అది అకాడమీ నిర్వహణ ఖర్చుల కోసం. అంతేకాకుండా... పేద కుటంబాలకు చెందిన మహిళలకు వందకు పైగా కుట్టు మిషన్లు ఉచితంగా అందించాను. జీర్ణావస్థలో ఉన్న స్థానిక గ్రంథాలయం పునర్నిర్మాణం కోసం నా సొంత భూమి కేటాయించాను.

**విలువ తెలుసు...**

విద్య విలువేంటో నాకు తెలుసు. దాని కోసం ఎన్నో బాధలు పడ్డాను. సవాళ్లు ఎదుర్కొన్నాను. పరిస్థితులు అనుకూలించక బడి మానేసే పిల్లల్ని చూసినప్పుడు బాధ కలుగుతుంది. అందుకే వివిధ కారణాలతో చదువుకు దూరమైన పిల్లలను తిరిగి బడి బాట పట్టించేందుకు, విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. వంద మంది పేద కుటుంబాలకు చెందిన పిల్లలను దత్తత తీసుకున్నాను. వారి చదువుకు అయ్యే ఖర్చంతా నేనే భరిస్తున్నా. ఏదిఏమైనా బాల్య వివాహం నా కలకు ముగింపు కాకూడదని, అది ఒక అసాధారణ కథకు ఆరంభం కావాలని నాడు నిశ్చయించుకున్నా. ఆ దృఢ సంకల్పమే నేడు వేలమంది జీవితాలకు, బంగారు భవిష్యత్తుకు భరోసా అయింది. ఇంతకు మించిన ఆత్మసంతృప్తి ఎక్కడ ఉంటుంది!"

# సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యం




జడ్చర్ల , ఆగస్టు 8, సమయం ప్రతినిధి : సనాతన ధర్మ పరిరక్షణ అలియాన్స్ కమిటీ ఆధ్వర్యంలో జడ్చర్ల దేవాలయాల కార్మిక ఆధ్యాత్మిక సంఘాలు కుల సంఘాలు అర్చక పౌరోహిత్య సంఘాలు, ఐక్య వేదికలు, స్వామీజీలు పీఠాధిపతులు గురూజీల సహకారంతో సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా జడ్చర్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం జడ్చర్ల హౌసింగ్ బోర్డు రామాలయం నుంచి సిగ్నల్ గడ్డ మీదుగా నేతాజీ చౌక్ నుంచి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. సనాతన ధర్మ అలయన్స్ కమిటీ చంద్ర రెడ్డియోగ గురూజీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో పలు పీఠాధిపతులు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాతృమూర్తి శశికళ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, కమిటీ సభ్యులు రజిత, విహెచ్పి లావణ్య, మానస, పద్మ,రాగసుధ దీపిక,శకుంతల నిర్మల,నాగరాజు,కృష్ణయ్య, విహెచ్పి నగర అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు జగపాల్ రెడ్డి, ప్రహ్లాద్ వెంకటేష్ రమేష్ గోనెల రాధాకృష్ణ హనుమాన్ చాలీసా బృందావనం మహిళలు రామనామాలతో ముత్యాలతో మహిళల అధిక సంఖ్యలో పాల్గొన్నారు కోలాటాలతో మారుమోగిస్తూ ఊరేగింపు ఘనంగా నిర్వహించడం జరిగిందివిశేషమైన హిందూ బంధువులు పాల్గొన్నారు.





# హలో డాడీ.. ఇట్స్ టైమ్.. ఐ యామ్ కమింగ్

కేజీఎఫ్ ఫ్రాంచైజ్‌తో భారతీయ సినీ రంగాన్ని శాసించిన రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ ప్రాజెక్ట్ టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్ . గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రతిష్టాత్మక కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా లైన్స్‌గేట్ సంస్థ భాగస్వామ్యంతో నిర్మించారు. ఇక ఈ చిత్రంలో యష్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి అగ్ర నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

టాక్సిక్ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకొంటుంది. సుమారు 4 నిమిషాల 38 సెకన్ల భారీ నిడివితో వచ్చిన ఈ ట్రైలర్ మొత్తాన్ని రక్తపాతంతో నింపేశారు. ఒక సరికొత్త ఇంటర్నేషనల్ డార్క్ అండ్ డార్క్-యాక్షన్ ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లారు. వర్షంలో ఒక చిన్న బాలుడు చేసే ప్రమాణంతో ప్రారంభమయ్యే ట్రైలర్, గ్యాంగ్‌స్టర్ డ్రామా, మాఫియా సామ్రాజ్య పోరాటాలు, స్టైలిష్ యాక్షన్ సీక్వెన్సెస్, సర్కస్ బ్యాక్‌డ్రాప్‌లోని విజువల్స్‌తో కట్టిపడేస్తోంది. రాయ అనే పెద్ద గ్యాంగ్‌స్టర్ జీవితంలో జరిగిన సంఘటనలు.. అతను పోరాడిన వ్యక్తులు అందరిని ఈ ట్రైలర్ లో పరిచయం చేశారు. ఇక చివరికి రాయ.. తన కన్న కొడుకుతోనే యుద్ధం చేయాల్సివస్తుంది. అలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది.. ? అసలు ఎవరీ రాయ.. ? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

నయనతార, కియారా అద్వానీ, హుమా ఖురేషి, తారా సుతారియా కేవలం గ్లామర్ పాత్రలు మాత్రమే చేసినట్లు ట్రైలర్ లో కనిపించడం లేదు. ముఖ్యంగా నయన్, కియారా.. రాయకు మధ్య ఎమోషనల్ బాండింగ్ ని చూపించారు. ఇక రుక్మిణి ప్రభుత్వం తరుపున పనిచేసే అధికారిగా కనిపిస్తోందని తెలుస్తుంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలు, హాలీవుడ్ స్థాయి ప్రొడక్షన్ వాల్యూస్, హై-వోల్టేజ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ట్రైలర్ కట్ అదిరిపోయింది. తండ్రీకొడుకులుగా యష్ పిచ్చెక్కించాడు. రవి బసూర్, విశాల్ మిశ్రా, తనిష్క్ బాగ్చి మ్యూజిక్ సినిమా మొత్తానికే హైలైట్ గా నిలవనుంది అని చెప్పొచ్చు. ట్రైలర్ తో మేకర్స్ సినిమాపై అంచనాలను పెంచేశారు. ఆగస్ట్ 26 న టాక్సిక్ ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమాతో యష్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.



# ఇండియాలోనే ఎందుకు ఆలస్యం..?

భారతీయ చలనచిత్ర పరిశ్రమ నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మహా ఇతిహాస కావ్యం రామాయణ. నితీష్ తివారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడుగా యష్ నటించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హాలీవుడ్ ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవలే మేకర్స్ గ్లోబల్ వైడ్ గా విడుదల చేసిన ఇంగ్లీష్ ట్రైలర్ ఇంటర్నేషనల్ స్థాయిలో మైండ్ బ్లోయింగ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని నవంబర్ 6న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు ముందే ప్రకటించారు. అయితే ఈ సినిమా విడుదల తేదీపై నిర్మాత నమిత్ మల్హోత్రా ఇచ్చిన ప్రకటన ఇప్పుడు ఇండియన్ ఆడియెన్స్‌ను షాక్‌కు గురిచేస్తోంది. ఇండియాలో మాత్రం రెండు రోజులు ఆలస్యంగా అంటే నవంబర్ 8న థియేటర్లలోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. భారతదేశపు గొప్ప కావ్యంతో తీస్తున్న ఈ సినిమాను సొంత దేశంలోనే ఆలస్యంగా విడుదల చేయడమేంటని ఇండియన్ సినీ ప్రేమికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు రోజుల గ్యాప్ వల్ల ఓవర్సీస్ నుంచి వచ్చే టాక్, రివ్యూస్, సోషల్ మీడియా స్పాయిలర్స్ ఇండియన్ బాక్సాఫీస్ పై ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ మొదలైంది. ఓవర్సీస్ ప్రీమియర్లు మరియు ఇంటర్నేషనల్ మార్కెట్‌పై భారీ నమ్మకంతోనే నిర్మాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నప్పటికీ, నవంబర్ 8న ఇండియాలో విడుదలయ్యే వరకు ఇండియన్ ఆడియెన్స్ మాత్రం మండి పడుతున్నారు. ఇది ఇండియన్స్ అవమానించడమే అంటూ చెప్పుకొస్తున్నారు. ఇక ఈ మధ్య రామాయణ మొదటి షో మోదీకి చూపించి ఆయన ఓకే అన్నాకనే రిలీజ్ చేయనున్నట్లు వార్తలు వచ్చాయి. మరి మేకర్స్ ఎలా ప్లాన్ చేస్తున్నారో చూడాలి.



# 'అగధ' సీక్వెల్‌కు ఆస్కారం!

కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం. ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వివా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో హీరో శ్రవణ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు.

**'డర్టీ హరి' తర్వాత ఇంత గ్యాప్ ఎందుకు వచ్చింది:** 'డర్టీ హరి' కరోనాలో రిలీజ్ అయింది. ఓటీటీలోకి నేరుగా వచ్చినా అక్కడ మాకు అద్భుతమైన రెస్పాన్స్ దక్కింది. ఆ టైంలోనే నాకు చాలా ఆఫర్స్ వచ్చాయి. కానీ కరోనా, లాక్డౌన్ కారణంగా ప్రాజెక్ట్స్ ఆలస్యం అవుతూ వచ్చాయి. 'మంగళవారం' సినిమా కోసం దాదాపు ఏడాది వెచ్చించాను. ఇక చివరకు మళ్లీ ఎంఎస్ రాజు గారు నాకు ఈ 'అగధ' అవకాశాన్ని ఇచ్చారు.

**అగధ'లో మీ పాత్ర తీరు గురించి చెప్పండి?**

'డర్టీ హరి'కి పూర్తి భిన్నంగా 'అగధ' పాత్ర ఉంటుంది. చాలా పార్శ్వాలు ఉండేలా కారెక్టర్‌ను డిజైన్ చేశారు. చాలా షేడ్స్ ఉన్న ఈ పాత్రను పోషించడం ఆనందంగా ఉంది. ఎంఎస్ రాజు గారి వంటి విజన్ ఉన్న ఫిల్మ్ మేకర్ మళ్లీ నాకు అవకాశం ఇవ్వడం చాలా లక్కీ అనిపిస్తుంది. 'అగధ' నాకు ఎంతో ఛాలెంజింగ్‌గా, డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది. డివైన్ మిస్టిక్ థ్రిల్లర్‌గా 'అగధ' చాలా అద్భుతంగా ఉంటుంది. ఇందులో హారర్, థ్రిల్ మూమెంట్స్ చాలా ఉంటాయి. ఏదైనా సరే కొత్తగా ఓ హుక్ పాయింట్ ఉండాలని ఎంఎస్ రాజు గారు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు.

**'అగధ' ట్రైలర్ చూస్తే మీదే నెగెటివ్ పాత్రలా కనిపిస్తోంది?**

ఇందులో నెగెటివ్ పాత్ర అనేది ఉండదు. పరిస్థితుల వల్లే పాత్రలు అలా ప్రవర్తిస్తుంటాయి. గుడ్ వర్సెస్ బ్యాడ్, గాడ్ వర్సెస్ ఈవిల్ అన్నట్టుగా సాగుతుంది. నా పాత్ర కోసం హోం వర్క్ చేయడానికి గానీ, ప్రిపేర్ అవ్వడానికి గానీ నాకు టైం దొరకలేదు. కథ చెప్పిన నాలుగో రోజే సెట్ మీదకు వచ్చాను. ఎంఎస్ రాజు గారు చెప్పింది చెప్పినట్టుగా నటించేశాను. నేను అంతా కూడా సెట్‌లోనే ప్రిపేర్ అయ్యానని చెప్పొచ్చు.

**'అగధ' విజయంపై, మీ పాత్రపై ఎలాంటి అంచనాలున్నాయి?**

అంచనాలు లేకుండా ఎలా ఉంటాయి!? 'డర్టీ హరి' ఓటీటీలో సక్సెస్ అయింది. అయితే హీరోకి బాక్సాఫీస్ నంబర్లే ముఖ్యం. 'అగధ'తో నాకు ఆ బాక్సాఫీస్ స్టాంప్ వస్తుందని ఆశిస్తున్నాను.

**ఎం.ఎస్. రాజుతో మీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి?**

'డర్టీ హరి', 'అగధ' కోసం ఎంఎస్ రాజు గారు రాసిన కథ, నా పాత్ర చాలా కొత్తగా అనిపిస్తుంది. ఎంఎస్ రాజు గారిని 'అగధ' సెట్‌లో చూస్తే చాలా కొత్తగా కనిపించారు. ఆయనకి సినిమా పట్ల ఉండే తాపత్రయం, డెడికేషన్‌ను నేను మ్యాచ్ చేయలేను.

**'అగధ'లో వీఎఫ్ఎక్స్ వర్క్ ఎలా ఉంటుంది?**

'అగధ' చిత్రాన్ని దాదాపు నేచురల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశారు. కొన్ని మాత్రం సెట్స్ వేశారు. ఈ మిస్టిక్, హారర్ ఫీల్‌ను ఇవ్వడానికి సెట్స్ వేయాల్సి వచ్చింది. మా సినిమాలోని వీఎఫ్ఎక్స్ వర్క్ చాలా నీట్‌గా, ఇంపాక్ట్ క్రియేట్ చేసేలా ఉంటుంది.

**'అగధ'కి సీక్వెల్ గానీ ప్రీక్వెల్ గానీ ఉంటుందా?**

ఇలాంటి చిత్రాలకు కచ్చితంగా అలాంటి సౌలభ్యం ఉంటుంది. పర్టిక్యులర్‌గా పార్ట్ 2 అని వేయకపోయినా.. కథను అల్లుకోవచ్చు. మరి ఎంఎస్ రాజు గారు రెండో పార్ట్ ఎప్పుడు అంటారో చూడాలి.


**ప్రస్తుతం చేస్తున్న, భవిష్యత్ ప్రాజెక్ట్‌ల గురించి చెప్పండి?**

రాజ్ అండ్ డీకే టీంలో పని చేసిన చంద్ర దర్శకత్వంలో ఓ మూవీని చేస్తున్నాను. ఆల్రెడీ కాశ్మీర్‌లో ఫస్ట్ షెడ్యూల్ పూర్తి చేశాం. కొన్ని ప్రాజెక్ట్‌లు చర్చల్లో ఉన్నాయి.

**ఎలాంటి పాత్రల్ని చేయాలనే కోరిక ఉంది?**

నా పాత్రకు ఇంపార్టెన్స్ ఉండాలని కోరుకుంటాను. 'అగధ'లో నా కారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ప్రతిసారి డిఫరెంట్ జానర్‌లో కొత్తగా ప్రయత్నించాలని చూస్తుంటాను.

Cinema



# మాస్, క్లాస్.. ట్రైలర్ రిలీజ్‌కు అంతా రెడీ..

మాస్ మహారాజా రవితేజ, శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' . మైత్రీ మూవీ మేకర్స్ గ్రాండ్‌గా నిర్మిస్తోన్న ఈ చిత్రం ఆగస్టు 21న భారీ స్థాయిలో థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్.. సినిమాపై భారీగా అంచనాలను పెంచేసిన విషయం తెలిసిందే. ఇప్పుడీ మూవీ నుంచి థియేట్రికల్ ట్రైలర్‌ను వదిలేందుకు మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు. డేట్ మాత్రమే కాదు.. ట్రైలర్ రివీల్ వేడుక ఎక్కడో కూడా అధికారికంగా ప్రకటించారు. ఆగస్ట్ 12న భీమవరంలో జరిగే భారీ కార్యక్రమంలో 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లుగా తెలుపుతూ మేకర్స్ ఓ పోస్టర్ వదిలారు. ఈ పోస్టర్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ కార్యక్రమానికి రవితేజ స్వయంగా హాజరుకానుండటంతో, ఇది సినిమా ప్రచారంలో ఒక కీలక ఈవెంట్ కానుంది. ట్రైలర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని గమనిస్తే.. రవితేజ రెండు విభిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. ఒకవైపు నోటిలో గొడ్డలితో మాస్ లుక్‌లో కనిపిస్తుండగా, మరోవైపు అయ్యప్ప మాల ధరించిన ఆధ్యాత్మిక అవతార్‌లో ఉన్నారు. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌లో సినిమా కథలోని భావోద్వేగ, ఆధ్యాత్మిక అంశాలనే ఎక్కువగా ప్రజెంట్ చేశారు. ఇప్పుడు ట్రైలర్ ద్వారా రవితేజ పాత్ర ఏమిటి? ఇతర కీలక పాత్రలతో ఆయన సంబంధం ఎలా ఉంటుంది? అసలు కథను నడిపించే పరిస్థితులు ఏమిటనే విషయాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇరుముడి'లో రవితేజ ఇప్పటివరకు చూడని విధంగా మరింత ఫ్యామిలీ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించనున్నారు. ముఖ్యంగా తన కుమార్తెకు, ఆయనకు మధ్య ఉండే అనుబంధం ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌లో ఆకట్టుకుంది. దీంతో సినిమాలో కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు కీలక స్థానం ఉండబోతుందనేలా తెలుస్తోంది. ప్రియ భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బేబీ నక్షత్ర ఓ కీలక పాత్రలో కనిపించనుంది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



# టెలివిజన్ ప్రీమియర్‌కు డేట్, టైమ్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ప్రియాంక అరుళ్ మోహన్ హీరోహీరోయిన్లుగా యంగ్ అండ్ డైనమిక్ డైరెక్టర్ సుజీత్ తెరకెక్కించిన మోస్ట్ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఓజీ' . బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ప్రభంజనం సృష్టించిన ఈ బ్లాక్‌బస్టర్ చిత్రం, థియేటర్ల తర్వాత ఓటీటీలోనూ సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఇప్పుడు చాలా గ్యాప్ తర్వాత ఈ క్రేజీ గ్యాంగ్‌స్టర్ డ్రామా బుల్లితెరపై గ్రాండ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌కు సిద్ధమైంది. పవన్ కళ్యాణ్ అభిమానులకు స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 'ఓజీ' సందడి చేయబోతోంది. ఈ సినిమా శాటిలైట్ హక్కులను దక్కించుకున్న ఈటీవీ, ప్రీమియర్ డేట్‌ను అధికారికంగా లాక్ చేసింది. ఆగస్ట్ 15న సాయంత్రం 6 గంటలకు ఈటీవీలో 'ఓజీ' గ్రాండ్‌గా ప్రసారం కానుంది. ముంబై మాఫియా నేపథ్యంలో పవన్ కళ్యాణ్ చూపించిన పవర్‌ఫుల్ ప్రెజెన్స్, మాస్ యాక్షన్ సీక్వెన్సెస్ బుల్లితెర వీక్షకులను, అభిమానులను విశేషంగా అలరించడం ఖాయంగా కనిపిస్తోంది. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డివివి దానయ్య ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు ప్రధాన అసెట్‌గా నిలిచాయి. ఇప్పటికే ఈ సినిమా స్మాల్ స్క్రీన్ ప్రోమోలు విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. మరోవైపు ఈ మైండ్ బ్లోయింగ్ హిట్ చిత్రానికి సీక్వెల్ 'ఓజీ 2'ను కూడా త్వరలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు దర్శకుడు సుజిత్ సన్నాహాలు చేస్తుండటంతో పవన్ ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చూద్దాం మరి..






OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085